

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:24 (శనివారం సాయంత్రం)
సహర్ : 4:44 (ఆదివారం ఉదయం)

# ఫ్రైడే



నిర్మానుష్యంగా గడియార స్తంభం సెంటర్

- దంచికొడుతున్న ఎండలు
- జనం విలవిల.. రోడ్లు నిర్మానుష్యం
- పెరిగిపోయిన ఉష్ణోగ్రతలు

అమలాపురం టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): వేసవి సీజన్ ప్రారంభంలోనే సూరీడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. భానుడి భగభగలతో 'ఫ్రై' డేగా మారిపోయింది. దాంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారిపోయాయి. శుక్రవారం మధ్యాహ్నం ప్రధాన రహదారులతోపాటు పలు వీధులు జన సంచారం లేక నిర్మానుష్యంగా మారిపోయాయి. పాదచారుల ఇబ్బందులు వర్ణనాతీతం. జిల్లాలో 35 డిగ్రీల నుంచి 38 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. కలెక్టర్ కార్యాలయానికి వివిధ పనులపై వచ్చిన వారు ప్రాంగణంలోని చెట్ల నీడన సేద తీరారు. ఇక కలెక్టర్‌ను కలిసేందుకు సఖినేటిపల్లి మండలం అంతర్వేది దేవస్థానం తదితర గ్రామాల నుంచి సుమారు 200 మంది ఆక్వా రైతులు, మహిళలు వచ్చారు. దాంతో కలెక్టరేట్ వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేశారు. పోలీసులు మండు టెండలో చెట్టు నీడన ఉండి అర్జీదారులతో మాట్లాడారు. కలెక్టరేట్‌లో ఈ చెట్లే లేకపోతే మలమల మాడిపోయేవారమని టీడీపీ ప్రభుత్వ హయాంలో వేసిన చెట్లు నీడనిస్తున్నాయని అర్జీదారులు పేర్కొనడం విశేషం.



అమలాపురం కలెక్టరేట్ వద్ద చెట్టు నీడన అర్జీదారులు



అమలాపురంలో పాదచారుల పాట్లు

---

మినరల్ వాటరే.. తాగండి పరవాలేదు.. ఇదీ ప్రస్తుతం ఎక్కడికి వెళ్లినా గ్లాసుతో నీళ్లిచ్చి ముందుగా చెప్పే మాట.. చాలామంది దృష్టిలో బయట నుంచి కొని టిన్నులతో తెచ్చుకుంది మినరల్ వాటర్ కింద లెక్క. ఆ నీరు ఎంత వరకూ సురక్షితమంటే కాస్త ఆలోచించాల్సిందే మరి.. ప్లాంట్ నీళ్లు తెచ్చుకున్నంత మాత్రాన సురక్షితం కాదు సుమా..! ఏదో మినరల్ వాటర్ తాగుతున్నామని పైకి చెప్పుకోవడం తప్ప.. బోరు వాటర్ కంటే అధ్వానమే మరి.. ఒకసారి మీరు మంచినీళ్లు తెచ్చుకునే ప్లాంట్‌కు అని అనుమతులు ఉన్నాయో లేదో చూస్కోండి.. లేదంటే మీ ఆరోగ్యం గోవిందా!?



# సుజలమేనా!

## నిబంధనలకు నీళ్లొదిలేస్తున్నారు

- మినరల్ పేరిట మోసం
- ప్యాకెట్లు.. బాటిళ్లతో సరఫరా
- పుట్టగొడుగుల్లా ప్లాంట్‌లు
- ఉమ్మడి జిల్లాలో 3 వేలు పైనే
- కనీస నిబంధనలూ కరువే
- ఐఎస్ఐ ప్రమాణాలు గాలికి
- జనం ఆరోగ్యంతో జలగాటం
- కన్నెత్తి చూడని అధికారులు
- మామూళ్ల మత్తు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

మినరల్ వాటర్ అనుకుంటూ లీటరు రూ.20 పెట్టికొంటున్నాం. మినరల్స్ మాట దేవుడెరుగు.. అసలు అవి సురక్షిత తాగునీరేనా? అంటే ఆలోచించాల్సిందే. కలుషిత నీటి వల్ల వివిధ రోగాల బారిన పడే ప్రమాదం ఉన్నా యంత్రాంగం ఉదాశీనంగా వ్యవహరిస్తోంది. దీంతో వాటర్ ప్లాంట్లు పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. సరైన పర్యవేక్షణ.. నియంత్రణ లేక మామూలు నీటిని నింపేసి నీళ్లలా డబ్బును దోచేస్తున్నారు. ప్యాకెజ్డ్, ప్యూరిఫైడ్ డ్రింకింగ్ వాటర్ రంగం వేల కోట్ల రూపాయల వ్యాపారమైపోయింది. నేడు ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా వాటర్ ప్లాంట్లపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

### పుట్టగొడుగుల్లా..

తాగునీరు ఇండియన్ స్టాండర్డ్స్ (ఐఎస్) ప్రమాణాల ప్రకారం ఉండాల్సిందే. కానీ వాటర్ ప్లాంట్ల విషయంలో అది అమలుకావడం లేదు. వాటర్ ప్లాంటు పెట్టాలంటే బోరుకు వాల్టా చట్ట ప్రకారం స్థానిక సంస్థలు తదితర అనుమతులు ఉండాలి. నీరు శుద్ధి చేసిన తర్వాత ప్యాకెట్లు, బాటిళ్లలో ప్యాక్ చేసి విక్రయించాలంటే కచ్చితంగా ఐఎస్ఐ ఉండాలి. ప్రభుత్వ అధికారులు వచ్చి ల్యాబ్‌తో సహా ఉన్నాయా లేదా అనేది పూర్తిగా తనిఖీలు చేస్తారు. నమూనాలను మైక్రో బయాలజీ ల్యాబ్‌లకు పంపించి పరిశీలిస్తారు. ఇది తీసుకున్న తర్వాత ఫుడ్ సేఫ్టీ అధికారులు ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) సర్టిఫికెట్ ఇస్తారు. ఇవి ఉంటేగానీ ప్యాక్ చేసి అమ్మడానికి వీల్లేదు. ఐఎస్ఐ లైసెన్స్‌కి ఏడాదికి రూ.1.25 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. ప్రస్తుతం చాలా మంది వాటర్ ప్లాంట్ల యజమానులు నిబంధనలకు నీళ్లొదిలేశారు. లూజ్ వాటర్ పేరుతో ప్లాస్టిక్ వాటర్ బాటిళ్లు, నాసిరకం వాటర్ ప్యాకెట్లలో నీటిని నింపి విక్రయిస్తున్నారు. నిబంధనల ప్రకారం లూజ్ వాటర్‌కి ఐఎస్ఐ10500 ప్రకారం నాణ్యతా ప్రమాణాలు ఉండాలి. వాటర్ ప్యాకెట్లు, బాటిళ్లప్లాస్టిక్‌లో నాణ్యతా ప్రమాణాలూ పాటించడం లేదు. చాలా ప్యాకెట్లలో నీరు ప్లాస్టిక్ వాసన వస్తుంటుంది. ఐఎస్ఐ కలిగిన బ్రాండెడ్ కంపెనీల లీటరు వాటరు బాటిల్ రూ.12-14 ఉంటే, నాసిరకం రూ.7-8కే దొరుకుతుంది. లాభం ఎక్కువగా వస్తుందనే కక్కుర్తితో నాసిరకం నీటినే అధికశాతం అమ్మకాలు సాగిస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఐఎస్ సర్టిఫికెట్ కలిగినవి కేవలం 10 వరకూ ఉంటే, లేనివి 3 వేల పైమాటే. అసలు ఎన్ని వాటర్ ప్లాంట్లు ఎక్కడెక్కడ ఉన్నాయనే లెక్క యంత్రాంగం వద్ద లేకపోవడం గమనార్హం.



### నేడు జల దినోత్సవం

తాగునీటి ప్రాముఖ్యత, వినియోగమే ఉద్దేశంగా 1993 నుంచీ మార్చి 22న అంతర్జాతీయ జల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. 2030 నాటికి సురక్షిత తాగునీరు, పారిశుధ్య రంగాల్లో సుస్థిర అభివృద్ధికి మద్దతు ఇవ్వడమే దీని లక్ష్యంగా అమలు చేస్తున్నారు. 'హిమానీ నదం సంరక్షణ' థీమ్‌తో ఈ ఏడాది అంతర్జాతీయ జల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం.

### మనమే పరీక్షించుకోవచ్చు..?

మనం తాగేనీటిలో మెగ్నీషియం, కాల్షియం, సోడియం, పొటాషియం, ఇనుము, రాగి, జింక్ వంటివి కలిసిపోయి ఉంటాయి. వీటన్నింటినీ కలిపి మొత్తం కలిగి ఉన్న లవణాలు లేదా టోటల్ డిసాల్వుడు సాలిడ్స్ (టీడీఎస్) అంటారు. టీడీఎస్‌తోపాటు పీహెచ్ స్థాయిలను బట్టి ఆ నీళ్ల మనం తాగొచ్చా లేదా అనేది నిర్ధారిస్తారు. టీడీఎస్ ఎక్కువగా ఉన్నా, పీహెచ్ స్థాయి 6 కంటే తక్కువగా 8.5 కంటే ఎక్కువగా ఉంటే రోగాల బారిన పడడం ఖాయం. టీడీఎస్, పీహెచ్ మీటర్లు బయట మార్కెట్లో దొరుకుతాయి. వాటితో మనం తాగేనీరు పరీక్షించవచ్చు.

### తాగునీటి ప్రమాణాలివే..

తాగునీరు కచ్చితంగా ఐఎస్ఐ ప్రమాణాలకు లోబడి ఉండాల్సిందే.ప్యాకెజ్డ్ తాగునీరు ఐఎస్ఐ 14543 ప్రమాణాలు పాటించాలి. టీడీఎస్ సున్నా నుంచి 500 వరకూ ఉండాలి. మినరల్ వాటర్ ఐఎస్ఐ 13428 ప్రమాణాలతో టీడీఎస్ 150- 500 ఉండాలి. నాచురల్ డ్రింకింగ్ వాటర్ ఐఎస్ఐ10500 ప్రమాణాలు కలిగి టీడీఎస్ 0-2 వేలు వరకూ ఉండొచ్చు. ఏదైనా పీహెచ్ మాత్రం 6 కంటే తక్కువ 8.5 కంటే ఎక్కువ ఉండరాదు. టీడీఎస్ అనేది ప్రాంతాలను బట్టి మారుతుంటుంది. గోదావరి నీటిలో 150 ఉంటే, కృష్ణా నీటిలో 350 వరకూ ఉంటుంది. వర్షం నీటిలో అసలు టీడీఎస్ ఉండదు. ఆమ్ల గుణం ఉంటుంది. బోరు నీటిలో టీడీఎస్ 10 నుంచి 15 వేల వరకూ ఉంటుంది. రివర్స్ ఓస్మాసిస్ ప్రక్రియ అనేది టీడీఎస్ తగ్గించడానికి చేస్తారు. దీని వల్ల 50% నీరు వృథా కావడంతోపాటు అవసరమైన లవణాలు పోతాయి. దాంతో లవణాలు కలిపి మినరల్ వాటర్‌గా అమ్ముతారు. అల్ట్రా వయోలెట్, అల్ట్రా ఫిల్టరేషన్ ప్రక్రియ ద్వారా బ్యాక్టీరియా మాత్రమే నశిస్తుంది.

### నీళ్లు తాగితే.. రోగాలే?

నిర్ధారిత ప్రమాణాల ప్రకారం లేని నీటిని తాగితే రోగాల బారిన పడక తప్పదు. తాగునీటిలో బ్యాక్టీరియా, వైరస్‌లు ఉండకూడదు. పీహెచ్ 6 కంటే తక్కువ 8.5 కంటే ఎక్కువ ఉండొద్దు. టీడీఎస్ కూడా అత్యధికంగా 2 వేలకు మించరాదు. అలా లేకపోతే అల్సర్లు, ఎసిడిటీ, అజీర్తి, ఉదర సంబంధిత వ్యాధులు, గ్యాస్ట్రిక్, మోకాళ్ల నొప్పులు వంటివి వస్తాయి.



### కేసులు.. జరిమానాలు

మిస్ బ్రాండింగ్ అంటే లేబుల్‌పై ప్రచురించిన ప్రకారం ఉండకపోతే రూ.3 లక్షల వరకూ జరిమానా విధిస్తారు. పీహెచ్ విలువ నిర్ధారించిన దానికంటే తక్కువగా ఉంటే రూ. 5 లక్షల వరకూ జరిమానా వేస్తారు. అన్‌సేఫ్.. అంటే ప్రజల ఆరోగ్యానికి హానికరం అని తేలితే కోర్టులో కేసు వేస్తారు. విచారణలో నేరం రుజువైతే రూ.5 లక్షల వరకూ జరిమానా లేదా 6 నెలల జైలు లేదా రెండూ విధించే అవకాశం ఉంది.

---



అమలాపురంలో మెడికల్ షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

# మెడికల్ షాపులపై మెరుపు దాడులు

- హడలెత్తిన వ్యాపారులు
- షాపులు మూసివేసి కొందరు పలాయనం

అమలాపురం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ గరుడలో భాగంగా జిల్లా కేంద్రమైన అమలాపురం పట్టణంలోని పలు కూడళ్లలో ఉన్న మెడికల్ షాపులపై వివిధ శాఖల అధికారులతో కూడిన బృందం శుక్రవారం ఆకస్మిక సోదాలు నిర్వహించింది. దాంతో పట్టణంలో ఉన్న మెడికల్ షాపుల యజమానులు కొందరు ఆ సమాచారం తెలుసుకుని షాపులు కట్టివేసి వెళ్లిపోవడం కనిపించింది. ఎప్పుడూ వందలాది మందికి వినియోగదారులతో రద్దీగా ఉండే కీలక మెడికల్ షాపులే లక్ష్యంగా చేసుకుని ఈ బృందం సోదాలు నిర్వహించడం వ్యాపార వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఎందుకంటే వీటిలో కొన్ని షాపుల్లో మందులు తగ్గింపు ధరలకు ఇస్తుండడంతో వినియోగదారులు వాటిపైకి ఎగబడుతుండడం వల్ల నిత్యం రద్దీగా ఉంటాయి. ఆ సమాచారంతోనే సోదాలు జరిగాయని తెలిసింది. కాగా అమలాపురం పట్టణంలో రాష్ట్ర డీజీపీ హరీష్‌గుప్తా ఇచ్చిన ఆదేశాల మేరకు ఆపరేషన్ గరుడలో భాగంగా పట్టణంలోని మెడికల్ షాపులపై వివిధ శాఖల అధికారులతో కూడిన బృందం ఆకస్మిక తనిఖీలు చేసింది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, పోలీసు, డ్రగ్స్ అధికారులతో కూడిన బృందం అమలాపురంలోని నాలుగు మెడికల్ షాపులపై తనిఖీలు చేపట్టారు. డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు అమ్మినా, శాంపిల్స్ డ్రగ్స్ అమ్మినా చర్యలు తీసుకునే లక్ష్యంతో ఈ సోదాలు చేశారు. కాగా నాలుగు మెడికల్ షాపులపై ఈ బృందం జరిపిన తనిఖీల్లో ఎటువంటి నిషేధిత మందులు లభ్యం కాలేదు. కానీ షాపుల్లో సరైన రికార్డులు నిర్వహించకుండా విక్రయాలు చేస్తున్నారని విజిలెన్స్ సీఐ గుమ్మళ్ల మధుబాబు తెలిపారు. ఈ తనిఖీల్లో డీసీటీవో నవీన్ కుమార్, డ్రగ్ ఇనస్పెక్టర్ మురళీ, లీగల్ ఇన్‌స్పెక్టర్ మురళీ తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి శక్తి బృందాల ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ కృష్ణారావు

# జిల్లాలో ఐదు శక్తి టీమ్‌లు ఏర్పాటు

- అమలాపురంలో 2, కొత్తపేట 2, రామచంద్రపురం 1
- శక్తి ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ యాప్‌పై అవగాహన కల్పించండి
- మహిళా పోలీసులకు స్కూటీలు అందించిన ఎస్పీ కృష్ణారావు

అమలాపురం, మార్చి21(ఆంధ్రజ్యోతి): నిత్య జీవితంలో మహిళలు, యువతులు, బాలికలపై రోజురోజుకు పెరుగుతున్న వేధింపులను అరికట్టడానికి పోలీసులు నడుం బిగించారు. ముఖ్యంగా వారిలో చైతన్యం పురికొల్పి వారిలో ఆత్మస్థైర్యం నింపేందుకు వీలుగా జిల్లాలో 'శక్తి' పేరుతో మహిళా పోలీసులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఎస్పీ బి.కృష్ణారావు ఐదు ప్రత్యేక మహిళా పోలీసు బృందాలను శక్తి టీమ్‌లుగా ఏర్పాటుచేశారు. వారికి స్కూటీలను కూడా అందజేసి జిల్లావ్యాప్తంగా తిరుగుతూ మహిళల్లో చైతన్యం తీసుకురావడంతోపాటు వారు ఎదుర్కొంటున్న వేధింపులు, ఇతర సమస్యలను తెలుసుకునేందుకే ఈ శక్తి బృందాల్లోని మహిళా పోలీసులు ప్రత్యేక కృషి చేస్తారు. అంతేకాకుండా వీరికోసం శక్తి ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ యాప్‌ను కూడా రూపొందించి దానివల్ల కలిగే ఉపయోగాలను వారికి తెలియజేస్తూ యాప్‌పై అవగాహన కల్పిస్తారు. ముఖ్యంగా కోనసీమ జిల్లాలో ఐదు శక్తి టీమ్‌లను జిల్లా ఎస్పీ కృష్ణారావు ఏర్పాటుచేశారు. వాటిలో అమలాపురం పోలీసు సబ్‌డివిజన్ పరిధిలో రెండు, కొత్తపేట పోలీసు సబ్ డివిజన్ పరిధిలో రెండు, రామచంద్రపురం పోలీసు సబ్‌డివిజన్ పరిధిలో ఒక టీమ్ ఏర్పాటయ్యాయి. మహిళలు, ఆడపిల్లల భద్రత కోసమే ఇవి ప్రత్యేకంగా పనిచేస్తాయి. ఈ సందర్భంగా ఎస్పీ, మహిళా పోలీసులతో శుక్రవారం జిల్లా ఎస్పీ కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన శక్తి టీముల్లోని సభ్యులకు వెహికల్స్‌ను అందజేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారితో కొద్దిసేపు ముచ్చటించారు. జిల్లాలో మహిళలు, యువతులు, ఆడపిల్లలకు ఏ చిన్న కష్టం వచ్చినా దగ్గరలో ఉండే పోలీసుస్టేషన్లు, శక్తి బృందాలకు తెలియచేయడంతోపాటు శక్తి యాప్‌ను వినియోగించుకోవాల్సిందిగా ఎస్పీ సూచించారు. ఎస్పీ అందించిన శక్తి సింబల్స్‌తో ఉన్న స్కూటీ వాహనాలతో మహిళా పోలీసులు అమలాపురం పట్టణ పురవీధుల్లో ర్యాలీగా తిరిగారు. యాప్, శక్తి టీమ్‌ల లక్ష్యాలను ప్రజలకు వివరించారు. అడ్మిన్ ఎస్పీ ప్రసాద్, డీఎస్పీ ప్రసాద్, పట్టణ సీఐ వీరబాబు, పలువురు మహిళా ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, ఎస్పీ కార్యాలయ ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

---



# ఉపాధి హామీలో రాష్ట్రంలో కోనసీమకు ప్రథమ స్థానం

- కూలీలకు 56 లక్షల పనిదినాల కల్పించి లక్ష్యానికి చేరువయ్యాం
- రోజువారీ సగటు వేతనం రూ.291
- కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాష్ట్రంలో ప్రథమస్థానంలో నిలిచిందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఉపాధి కూలీలకు 57లక్షల పనిదినాలు కల్పించడం లక్ష్యం కాగా, ఇప్పటికే 56 లక్షల పనిదినాలు కల్పించి ఈ ఘనత సాధించినట్టు తెలిపారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్‌లు శుక్రవారం అమరావతి నుంచి వివిధ జిల్లాల కలెక్టర్లతో ఉపాధి హామీ పథకంపై వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. రాబోయే ఆర్థిక సంవత్సరంలో చిన్నా, సన్నకారు రైతులు లక్ష ఎకరాల్లో పండ్లతోటల పెంపకానికి ప్రణాళికలు, పంట సేద్యపు నీటి కుంటల నిర్మాణం, గోకులాలు, సీసీ రోడ్ల నిర్మాణాల పురోగతిపై జిల్లాల వారీగా కలెక్టర్లను వారు సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్సు అనంతరం కలెక్టర్ మహేష్‌కుమార్ అధికారులతో మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో రోజువారీ సగటు వేతనాన్ని రూ.291.21గా చెల్లిస్తూ కోనసీమ జిల్లా రాష్ట్రంలో ప్రతమస్థానంలో నిలిచిందన్నారు. పల్లె పండుగలో భాగంగా 896 గోకులాలు మంజూరుచేయగా 720 నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. మిగిలిన వాటిని నెలాఖరు నాటికి పూర్తిచేయాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా 110 కిలోమీటర్ల మేర సీసీ రోడ్లు మంజూరు చేయగా వీటిలో 84 కిలోమీటర్ల అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయిందని, మిగిలిన వాటిని నెలాఖరులోగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయడంతోపాటు కూలీల రోజువారీ వేతనాన్ని రూ.300 వరకు ఇచ్చేందుకు పాటుపడాలన్నారు. బోగస్ మస్తర్లకు అడ్డుకట్ట వేయడంతోపాటు పనివేళల్లో మార్పులు చేస్తూ కూలీలకు గిట్టుబాటు వేతనం అందించాలన్నారు. వేసవి సీజన్‌లో పని జరిగే ప్రాంతాల్లో నీడ కోసం షెడ్లు ఏర్పాటుచేయడంతోపాటు సురక్షిత తాగునీరు అందించాలన్నారు. ప్రాథమిక చికిత్స, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. వేతన మోనటరింగ్ కమిటీతోపాటు మూడు అంచెల తనిఖీ వ్యవస్థను ప్రభుత్వం అమలులోకి తెచ్చిందన్నారు. ఉద్యోగులు అవినీతికి పాల్పడితే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వర్షపు నీటి బొట్టును ఒడిసిపట్టి సాగునీటి ఎద్దడి నివారణకోసం కృషిచేయాలని, దీనివల్ల రైతుల పెట్టుబడి ఖర్చులు తగ్గించవచ్చన్నారు. డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ సీహెచ్‌ఎన్వీ కృష్ణారెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ పి.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

# దంపతుల కిడ్నాప్.. ఆరుగురిపై కేసు

- మహిమ గల రాయి కోసం రూ.80 లక్షల లావాదేవీలు
- సొమ్ముల కోసం కారులో కిడ్నాప్ చేశారని భర్త ఫిర్యాదు
- అప్పుగా ఇచ్చి మోసపోయామని మరో వర్గం ఆరోపణ

రావులపాలెం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): తమను ఆరుగురు వ్యక్తులు కొట్టి కారులో ఎక్కించుకుని కిడ్నాప్ చేశారని దంపతుల్లో భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ శేఖర్‌బాబు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్టీఆర్ జిల్లా గుడివాడకు చెందిన కేశనమటం రామకృష్ణ, అతని భార్య చైతన్య పది సంవత్సరాల కిందట రావులపాలెం వచ్చి బ్యాంకు లోన్స్ కన్సల్‌టెన్సీ పెట్టి జీవిస్తున్నారు. వీరికి వెలగల వెంకటకృష్ణారెడ్డితోపాటు పలువురు వారికి పరిచయం అయ్యారు. సూర్యనందిని అనే మహిమ గల రాయి రూ.80 లక్షల విలువని, దాన్ని కొనుగోలుకోసం అడగగా వెంకటకృష్ణారెడ్డి ఆ సొమ్ములు తమకు ఇచ్చారని రామకృష్ణ ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఆ సొమ్ములు అప్పుగా ఇచ్చామని వెంకటకృష్ణారెడ్డి, భాస్కరరెడ్డి, మణికంఠ పృథ్వీ, మోహనసతీష్, శాంతికుమారి, ప్రసాద్‌లు ఆ సొమ్ములు తిరిగి ఇచ్చేయాలని తమ దంపతులును బెదిరించారన్నారు. వీరికి భయపడి ఓ హోటల్‌లో తలదాచుకోగా వారందరూ ఒకేసారి వచ్చి కారులోకి బలవంతంగా ఎక్కించి కొవ్వూరు సమీపంలోని దేవరపల్లి వద్ద ఉన్న కృష్ణపాలెం తీసుకెళ్లారన్నారు. దీంతో రామకృష్ణ కుమారుడు భరత్ వీరికి ఫోన్ చేసి తన తండ్రిని ఎందుకు తీసుకుని వెళ్లారని పోలీసులకు ఫిర్యాదు చేస్తాననడంతో తమను విడిచిపెట్టారన్నారు. కాగా రామకృష్ణ ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకుని ఫిర్యాదు చేశాడని, అతను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు. కాగా రావులపాలెంలో బ్యాంకు లోన్స్ ప్రైవేటు కన్సల్‌టెన్సీతోపాటు మహిమల గల రాళ్లు, సబ్సిడీకి రుణాల పేరుతో కొంతమంది నుంచి భారీగా నగదుని ఈ దంపతులు తీసుకున్నట్టు బాధితులు ఆరోపిస్తున్నారు. మహిమ గల రాళ్ల వ్యవహారంగా ఫిర్యాదుదారుడే చెబుతుండగా, అప్పుగా ఇచ్చామని మరో వర్గం చెబుతోంది.

# ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సహకరించాలి : డీఆర్వో



పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో

అమలాపురం టౌన్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఏరకమైన ఎన్నికలైనా సజావుగా నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల సహకారం అత్యంత అవసరమని జిల్లా రెవెన్యూ అధికారి బీఎల్ఎన్ రాజకుమారి పేర్కొన్నారు. స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీతోపాటు అవసరమైన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సహకరించాలని కోరారు. ప్రతీ మూడు నెలలకోసారి 18 ఏళ్లు నిండిన వారిని ఓటరుగా నమోదు చేసుకునే వెసులుబాటును వినియోగించుకోవాలని సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లాస్థాయి సూచనలు, సలహాల సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి రాజకీయ పార్టీలు తగు సలహాలు, సూచనలు అందించాలని కోరారు. వయసులవారీగా ప్రస్తుతం కొనసాగుతున్న ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పకడ్బందీగా అమలు చేస్తున్నామన్నారు. ఫారం-6,7,8 క్లెయిమ్‌లను పారదర్శకంగా పరిష్కరిస్తున్నామన్నారు. రెండు కిలోమీటర్ల కంటే ఎక్కువ దూరం ఉంటే ప్రత్యేక పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేసేందుకు ఎన్నికల సంఘం అనుమతి ఇస్తుందన్నారు. బోడసకుర్రు టిడ్కో గృహాల్లో ఉంటున్నవారికి అమలాపురం పరిసర ప్రాంతాల్లోనే ఓటు హక్కు ఉందని, వీరి ఓట్లను టిడ్కో ప్రాంతానికి మార్చు చేయాలని, కోరగా చర్యలు చేపడతామని డీఆర్వో తెలిపారు. అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు (టీడీపీ), దూరి రాజేష్ (బీజేపీ), చిక్కాల సతీష్ (జనసేన), వడ్డి నాగేశ్వరరావు (కాంగ్రెస్), భవానీ (బీఎస్పీ), ఉపతహశీల్దార్ శివరాజ్, సాయిరామ్ పాల్గొన్నారు.

# మిద్దెపై బుజ్జి తోట!







ఆలమూరు మండలం జొన్నాడలో మిద్దె తోటల సాగు.. (పైన) పదేళ్ల బోన్సాయ్.. (కింద) సపోటా

గృహిణి బి.మాధవి.. (పైన) వాటర్ బాటిళ్లతో అందంగా..

- మిద్దె సాగులో జొన్నాడ గృహిణి నూతన ఒరవడి
- వ్యర్థాలకు అందమైన రూపు
- మొక్కలపై మమకారమే కారణమంటున్న మాధవి

(ఆలమూరు- ఆంధ్రజ్యోతి)

ఆరోగ్యకరమైన కూరగాయలు, మధుర ఫలాలను అందించే రకరకాల పండ్ల మొక్కలు, రంగురంగుల పూలమొక్కలు, స్వచ్ఛమైన గాలిని అందించే చెట్లు... వీటితో మిద్దె తోటలను సృష్టించారు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడకు చెందిన గృహిణి బి.మాధవి. కొంచెం అభిరుచి, ఇంకొంచెం ఆలోచన, మరికొంచెం ఓపిక ఉంటే చాలు ఇంటిని హరిత నందనవనంలా మార్చేయ వచ్చని నిరూపించారామె. ఇందుకు వ్యర్థాలనే అర్థవంతంగా వాడడం మరో ప్రత్యేకత. ప్రస్తుత కాలంలో పీల్చేగాలి, తాగేనీరు తినే ఆహారం... ఇలా ప్రతీదీ కలుషితమై, రసాయనాలతో నిండిపోయి తరచూ అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. వీటిని అధిగమించడానికి ఆమె ఇంటి మేడపైనే సాగుకు శ్రీకారం చుట్టారు.

## 500 రకాల మొక్కలు

ఇంటి డాబాపై ఉన్న కొద్దిపాటి స్థలంలోనే దాదాపు 500 రకాల మొక్కలను పెంచుతున్నారు. ఈ అందమైన తోటకు మాధవి ముద్దుగా 'మా బుజ్జి తోట' అని నామకరణం చేసుకున్నారు. ఫలాలు అందించే మొక్కలు, పరిమళాలు వెదజల్లే పూలమొక్కలు, ఆరోగ్యాన్ని అందించే ఔషధ మొక్కలు, ఇంట్లో తినడానికి కూరగాయలు, ఆకుకూరలు... ఇలా అనేక రకాలు పెంచుతున్నారామె. ఏదైనా కొత్తగా చేయాలంటే చదువుకున్న వారికి మంచి ఆలోచనలు వస్తాయని అంటుంటారు. అయితే హరిత నందనవనం పెంచుతున్న మాధవి కేవలం ఐదో తరగతి వరకు మాత్రమే చదువుకున్నారు. మొక్కలపై ఉన్న మమకారంతో పదేళ్ల కిందట ప్రారంభించి నేడు వందల సంఖ్యలో మొక్కలను పెంచి ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు. భర్త సాయిబాబు ప్రోత్సాహంతో ఇన్ని రకాల మొక్కలను పెంచుతున్నట్టు మాధవి చెప్పారు. తనకు ఏరువాక శాస్త్రవేత్తల గుర్తింపు లభించిందని ఆనందం వ్యక్తంచేశారు.

## పనికిరాని వస్తువులతో అద్భుతాలు

ఇంట్లో పనికిరాని వస్తువులను మనం బయట పడేస్తుంటాం. అయితే మాధవి మాత్రం వాటినే పెట్టుబడిగా పెట్టి కొత్త ఆలోచనతో వాటిని అందంగా తయారుచేసి వాటిలో మొక్కల పెంపకం చేస్తున్నారు. వాటర్ బాటిల్స్, కూల్ డ్రింక్ బాటిల్స్, వాటర్ టిన్స్, ప్లాస్టిక్ డబ్బాలు, పనికిరాకుండాపోయిన ఫ్రిజ్, గ్రైండర్.. ఇలా అనేక రకాలను మొక్కల పెంపకానికి ఉపయోగిస్తున్నారు.


## సేంద్రియ ఎరువుల తయారీ

ఇంట్లో మిగిలిపోయిన ఆహార పదార్థాలు, వాడి పాడేసిన టీపొడి, కుళ్లిపోయిన కూరగాయలతోపాటు కూరగాయలు, ఉల్లిపాయలు పైతొక్కలను నిల్వచేసి ఎరువుగా మార్చి వాటిని మొక్కలకు అందిస్తున్నారు. ఇంట్లో నిల్వ ఉండి పాడైపోయిన పిండి పదార్థాలను నీటిలో కలిపి నిల్వ చేయడం ద్వారా వాటిని మొక్కలకు వేస్తే బలంగా పెరుగుతాయన్నారు.

## చీడపీడల నివారణ

మొక్కలు అనేటప్పటికి చీడపీడల బెడద ఉంటుంది. పొగాకు కాడలు ఉపయోగించి వాటిని నివారిస్తున్నామని ఆమె చెప్పారు. వేపను కూడా ఉపయోగిస్తున్నామని తెలిపారు.

# ఉభయ తారకంగా..
# సీలేరు కాంప్లెక్స్



- అటు జలవిద్యుత్ ఉత్పత్తిలోనూ భేష్
- ఇటు గోదావరిడెల్టాకు నీటివిడుదల
- జలవిద్యుదుత్పత్తిలో నెల రోజుల ముందే లక్ష్యాన్ని అధిగమించిన మూడు విద్యుత్ కేంద్రాలు
- రబీ సీజన్‌లో 10 నుంచి 15 టీఎంసీల వరకు గోదావరి డెల్టాకు నీరు

మోతుగూడెం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని జలవిద్యుత్ కేంద్రాల్లో మూడు కేంద్రాలు విద్యుత్ ఉత్పత్తి లక్ష్యాలను నిర్దేశించిన గడువు కంటే ముందుగానే అధిగమించి రికార్డు నెలకొల్పాయి. కాంప్లెక్స్ పరిధిలో మాచ్‌ఖండ్, ఎగువసీలేరు, డొంకరాయి, పొల్లూరు నాలుగు జలవిద్యుత్ కేంద్రాలు ఉండగా ఒక్క మాచ్‌ఖండ్ మినహా మిగతా మూడు కేంద్రాలు లక్ష్యాలను నెలరోజుల కంటే ముందే పూర్తి చేశాయి.

సీలేరు కాంప్లెక్సులోని 2024-25 సంవత్సరానికి సెంట్రల్ విద్యుత్ అథారిటీ వారు పొల్లూరు జలవిద్యుత్ కేంద్రానికి 1084 మిలియన్ యూనిట్లు, డొంకరాయి జలవిద్యుత్ కేంద్రానికి 85 మిలియన్ యూనిట్లు, ఎగువ సీలేరు జల విద్యుత్ కేంద్రానికి 477 మిలియన్ యూనిట్లు లక్ష్యంగా నిర్ణయించారు. ఈ మేరకు కాంప్లెక్స్ పరిధిలోని డొంకరాయి జలవిద్యుత్ కేంద్రం మొదటిగా జనవరిలోనే అంటే రెండు నెలలు ముందేఅధిగమించి రికార్డు నెలకొల్పింది. ఎగువ సీలేరు, పొల్లూరు రెండు జలవిద్యుత్ కేంద్రాల్లో ఫిబ్రవరి నెలాఖరు నాటికి టార్గెట్‌నే పూర్తిచేశాయి. నెలరోజులు ముందుగానే టార్గెట్‌లను పూర్తి చేసి రికార్డులను నెలకొల్పాయి. మార్చి 16నాటికి సీలేరు కాంప్లెక్స్‌లోని నాలుగు జలవిద్యుత్ కేంద్రాల్లో 2305 మిలియన్ యూనిట్లు విద్యుత్ ఉత్పత్తి చేశారు. సీలేరు కాంప్లెక్స్ జలాశయాలు అన్నింటికీ మార్చి 31 నాటికి సెంట్రల్ విద్యుత్ అథారిటీ నిర్దేశించిన టార్గెట్ 2286 మిలయన్ యూనిట్లు కాగా మార్చి 16నాటికి 2305 మిలియన్ యూనిట్లు ఉత్పత్తిచేసి 29మిలియన్ యూనిట్లు అధికంగా చేసి రికార్డు నెలకొల్పింది.

### రబీకి నీటి విడుదల

సీలేరు కాంప్లెక్స్‌లో రాష్ట్రానికి విద్యుత్ వెలుగులు పంచడమే కాకుండా గోదావరి డెల్టాకు రబీ పంటలకు నీటిని సరఫరా చేయడంలో కీలకమైన భూమిక పోషిస్తోంది. రబీ సీజన్‌లో గోదావరి డెల్టాలకు సీలేరు నీరే ప్రధానం. ప్రతిఏటా రబీ సీజన్‌లో సీలేరునుంచి విద్యుత్ ఉత్పత్తి అనంతరం కొంతనీరు విడుదల కాగా, రబీ పంటల అవసరాల నిమిత్తం విద్యుత్ ఉత్పత్తి చేయకుండా నేరుగా గోదావరి డెల్టాకు ప్రతిఏటా 10నుంచి 15 టీఎంసీల వరకు విడుదల చేస్తుంటారు. ఈ ఏడాది రబీ పంటలకు ఫిబ్రవరి 10 నుంచి మార్చి 21 వరకు నీటిని విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులు, జెన్‌కో అధికారులను కోరారు. దీంతో డొంకరాయి జలాశయం నుంచి నేరుగా 3వేల క్యూసెక్కులు ఒకసారి, మరో 4,300 క్యూసెక్కులనుంచి విద్యుత్ ఉత్పత్తి అనంతరం కొంతనీరు మరోసారి విడుదల చేస్తున్నారు. రబీ పంటల అవసరాల నిమిత్తం విద్యుత్ ఉత్పత్తి చేయకుండా నేరుగా గోదావరి డెల్టాకు ప్రతిఏటా 10నుంచి 15 టీఎంసీల వరకు విడుదల చేస్తుంటారు. ఈ ఏడాది రబీకి ఫిబ్రవరి 10 నుంచి మార్చి 21 వరకు నీటిని విడుదల చేయాలని ఇరిగేషన్ అధికారులు జెన్‌కో అధికారులను కోరారు. దీంతో డొంకరాయి జలాశయంనుంచి రెండు దఫాలుగా నీటిని విడుదల చేస్తున్నారు. ఇప్పటివరకు 9టీఎంసీల నీటిని విడుదల చేశామని, నీటి విడుదలను మార్చి 31వరకు పొడిగించామని జెన్‌కో అధికారులు తెలిపారు. సీలేరు కాంప్లెక్సు విద్యుత్‌ఉత్పత్తిలోనే కాకుండా రబీలో గోదావరి డెల్టాకు నీటి విడుదల చేస్తూ బహుళార్థక సాధక ప్రాజెక్టుగా పేరు గాంచింది.

# మంచు.. టెండ..



కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలంలో ఉదయంపూట పొలాలపై కురుస్తున్న మంచు



అమలాపురంలో ద్విచక్రవాహనంపై ముసుగుతో యువతి

రోజంతా ఎండ.. రాత్రినుంచి తెల్లవారు జాము వరకు మంచు. ఇది ఉమ్మడి జిల్లాలో పరిస్థితి. జనం ఎండనుంచి రక్షణకు ముసుగులతో ఇలా ప్రయాణాలు చేస్తున్నారు.



కాకినాడలో స్కూటీపై స్కార్ఫ్ కట్టుకుని వెళ్తున్న యువతి

## వ్యాపారం, రాజకీయం డబ్బున్న వాళ్లే చేస్తే
# మనం దేనికోసం పుట్టాం

- ఏపీ ఎంఎస్ఎంఈ చైర్మన్ టి.శివశంకరరావు
- ఐడియల్ కళాశాలలో గ్రోత్ ఇంజన్ ఆఫ్ ఇండియాపై జాతీయ సదస్సు




సదస్సులో మాట్లాడుతున్న ఎంఎస్ఎంఈ చైర్మన్ శివశంకరరావు

కాకినాడ రూరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): వ్యాపారం, రాజకీయం డబ్బున్న వాళ్లేచేస్తే మిగతా జనం దేనికోసం పుట్టినట్లని ఏపీ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) డవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ టి.శివశంకర రావు అన్నారు. కాకినాడ విద్యుత్‌నగర్‌లోని ఐడీయల్ డిగ్రీ కళాశాలలో ఎకనామిక్స్, కామర్స్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగాల ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈలు గ్రోత్ ఇంజిన్ ఆఫ్ ఇండియా అనే అంశంపై రెండురోజుల పాటూ నిర్వహించే జాతీయస్థాయి సదస్సును టి.శివశంకరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.సత్యనారాయణ ఈ సదస్సుకు అధ్యక్షత వహించగా శివశంకరరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఆలోచనలు, అభివృద్ధి విషయంలో ప్రజల భాగస్వామ్యం కీలకమవుతున్నదని సీఎం నారా చంద్రబాబునాయుడు తరచూ చెబుతున్నారని ఇలాంటి సదస్సులు అందుకు తోడ్పడతాయన్నారు. ఎంఎస్ఎంఈ ద్వారా పెట్టుబడిలేనివాళ్లు కూడా సంపద సృష్టించగలరని తెలిపారు. ఈ కార్పొరేషన్ ద్వారా లక్షల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సృష్టించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. అనంతరం కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ డాక్టర్ పి.చిరంజీవినీ కుమారి మాట్లాడుతూ చదివితే ప్రభుత్వమే ఉద్యోగాలిస్తుందనే భావనలో మార్పు వచ్చిందన్నారు. అందుకే ప్రభుత్వ, ఎంఎస్ఎంఈ ఆశయాలను విద్యార్థులకు అందించేందుకు తమ కళాశాల అకడమిక్, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్లు ఎం.రంజిత్, కేఎస్‌వాసు సారథ్యంలో ఈ జాతీయస్థాయి సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అతిథులు డాక్టర్ స్టీవెన్‌రాజు రచించిన గ్రోత్ ఇంజిన్ ఆఫ్ ఇండియా పుస్తకాన్ని, సదస్సు బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో ఎస్వీయూ విశ్రాంత ప్రొఫెసర్ హిమాచలం దాసరాజు, ప్రొఫెసర్ ప్రసాదరావు, బి.శ్రీనివాస్, సదస్సు కన్వీనర్ డాక్టర్ స్టీవెన్‌రాజు, గవర్నింగ్ బాడీ సభ్యులు జీవీ కృష్ణంరాజు, జీవీకే వర్మ, శివరామకృష్ణ, విభాగాధిపతులు శ్రీనివాస్, నాగేశ్వరరావు, ప్రభాకర్ బాబ్జీ, ప్రసూన, శశిరేఖ, గోపాలకృష్ణ యాదవ్, మౌనిక, రమణ, అర్జునరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గేట్‌లో...గ్రేట్

- జేఎన్టీయూకేలోని యూసీఈకే విద్యార్థి ఘనత
- ఈసీఈ విద్యార్థి సీహెచ్ సాయిచరణ్‌కు జాతీయస్థాయిలో 9వ ర్యాంకు

జేఎన్టీయూకే, మార్చి 21(ఆంధ్రజ్యోతి): గేట్-2025 పరీక్షలో జేఎన్టీయూకేలోని యూసీఈకే ఈసీఈ విద్యార్థి సీహెచ్ సాయిచరణ్ ప్రతిభ కనబరచి 967 స్కోర్‌తో జాతీయస్థాయిలో 9వ ర్యాంకు సాధించినట్లు ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రార్ రవీంద్రనాధ్ తెలిపారు. ఈసందర్భంగా ఉత్తమ ర్యాంకు సాధించిన సాయిచరణ్‌ను శుక్రవారం తన ఛాంబర్‌లో ఉపకులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ అభినందించారు. వీసీ మాట్లాడుతూ విద్యార్థులు తాము అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు పట్టుదలతో చదివినపుడు విజయాన్ని సులువుగా అందుకోగలరన్నారు. సాయిచరణ్‌ను అభినందించిన వారిలో రిజిస్ట్రార్ రవీంద్రనాధ్, ఐఐఐపీటీ డైరెక్టర్ బీటీ కృష్ణ, ప్రిన్సిపాల్ మోహన్‌రావు, లీలాకుమారి ఉన్నారు.



సీహెచ్ సాయిచరణ్‌ను అభినందిస్తున్న వీసీ డాక్టర్ సీఎస్ఆర్కే ప్రసాద్

# ఎన్ఏబీఎల్ అక్రిడిటేషన్ ప్రయోజనాలపై అవగాహన సదస్సు

జేఎన్టీయూకే, మార్చి 21(ఆంధ్రజ్యోతి): వర్శిటీలోని సెనేట్ హాల్లో ఎన్ఏబీఎల్ గున్వత్త యాత్రలో భాగంగా నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ కాలిబ్రేషన్ లేబరేటరీస్ (ఎన్ఏబీఎల్) సహకారంతో జేఎన్టీయూకే స్కూల్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఎన్ఏబీఎల్ అక్రిడిటేషన్, ప్రయోజనాలపై అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. డైరెక్టర్, విభాగాధిపతి మాలోతు రమేష్ అధ్యక్షతన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రిజిస్ట్రార్ రవీంద్రనాధ్, విశిష్టఅతిథి గా క్యూసీఐ డైరెక్టర్, ఎన్ఏబీఎల్ రీజినల్ హెడ్ శ్రీకాంత్ రామచంద్రయ్య, ఏడీ పి.శ్రీరామ్ పాల్గొన్నారు. రిజిస్ట్రార్ మాట్లాడుతూ వర్శిటీలోని ఫుడ్ టెస్టింగ్ ల్యాబ్ ఎన్ఏబీఎల్ అక్రిడిటేషన్ పొందడం ద్వారా పరిశ్రమలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దుతామన్నారు. అనంతరం శ్రీ కాంత్ రామచంద్రయ్య మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఎన్ఏబీఎల్ అక్రిడిటేషన్ పొందిన పరిశ్రమలు, ప్రయోగశాలలు 9వేలకుపైగా ఉన్నాయని తెలిపారు. ఈ సదస్సులో పలు పరిశ్రమల ప్రతినిధులు, వ్యాపారవేత్తలు, అధ్యాపకులు పాల్గొన్నారు.



రిజిస్ట్రార్, డైరెక్టర్, అతిథులతో పరిశ్రమల ప్రతినిధులు, విద్యార్థులు

## దుర్గాడ శివాలయంలో
# అరుణ కిరణ స్పర్శ

- స్వామిపై ప్రసరించిన సూర్యకిరణాలు

గొల్లప్రోలురూరల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో మూలవిరాట్‌లపై అరుణ కిరణ స్పర్శతో భక్తులు తన్మయత్వంలో మునిగారు. శుక్రవారం సాయంత్రం ఈ దృశ్యం ఆవిష్కృతమైంది. గర్భాలయంలో ఉన్న పంచాయతన సమేత ఉమారామలింగేశ్వర స్వామిపై సూర్యకిరణాలు ప్రసరించాయి. స్వామి, అమ్మవార్లు పసిడి రంగు వెలుగులతో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తుల ఆధ్వర్యంలో స్మార్త విద్యార్థుల పండిత బృందంతో మహాసౌర పారాయణ చేశారు. భక్తులు స్వామి, అమ్మ వార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఉత్తరాయణంలో ఒకసారి, దక్షిణాయణంలో మరొకసారి ఏటా సూర్యకిరణాలు ప్రసరిస్తాయని ఆలయ సేవాసమితి సభ్యులు తెలిపారు.



దుర్గాడ శివాలయంలో పంచాయతన సమేత ఉమా రామలింగేశ్వరస్వామిపై ప్రసరించిన సూర్యకిరణాలు

## 27 నుంచి దక్షిణ భారత రాష్ట్రాల
# వ్యవసాయ ప్రదర్శన

- రైతులను ఉచితంగా తీసుకువెళతాం
- జిల్లా ఏరువాక కేంద్రం సమన్వయకర్త నరసింహారావు

దివాన్‌చెరువు, మార్చి21 (ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం ఈనెల 27 నుంచి 29 వరకూ దక్షిణ భారత వ్యవసాయ ప్రదర్శనను గుంటూరులోని లాంఫామ్‌లో నిర్వహిస్తున్నట్టు ఏరువాక కేంద్రం తూర్పుగోదావరిజిల్లా సమన్వయకర్త చల్లా వెంకట నరసింహారావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ పరిశోధనా స్థానాలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, ఏరువాక కేంద్రాల వ్యవసాయ పద్ధతులు, కూరగాయలు, పండ్ల సాగులో అధునాతన సాగు పద్ధతులు, వ్యవసాయ యాంత్రీకరణ, డ్రోన్ల వినియోగం తదితర అంశాల ప్రదర్శన ఉంటుందన్నారు. దీంతోపాటు రైతుల, శాస్త్రవేత్తల చర్చా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. దక్షిణ భారత వ్యవసాయ నిపుణులు రైతులతో సంభాషిస్తారని చెప్పారు. ఈ ప్రదర్శనను రైతులు వినియోగించుకోవాలని కోరారు. ఈ ప్రదర్శనకు రైతులను ఉచితంగా తీసుకువెళతామని చెప్పారు. ఔత్సాహిక రైతులు ఏరువాక కేంద్రం వారిని 90323 46137లో సంప్రదించాలని నరసింహారావు పేర్కొన్నారు.

# జనసేన తీర్థం పుచ్చుకున్న ఆరుగురు వైసీపీ ఎంపీటీసీలు

- తెనాలిలో మంత్రి నాదెండ్ల సమక్షంలో చేరిక

సర్పవరం జంక్షన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : కాకినాడరూరల్ మండలం వైసీపీ పార్టీకి ఆరుగురు ఎంపీటీసీలు షాక్ ఇచ్చారు. ఆపార్టీని వీడి జనసేన పార్టీ గూటికి చేరారు. శుక్రవారం తెనాలిలో జనసేనపార్టీ కార్యాలయంలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆపార్టీ రాష్ట్ర పీఏసీ చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ సమక్షంలో కాకినాడ రూరల్‌కు చెందిన ఆరుగురు వైసీపీ ఎంపీటీసీ సభ్యులకు పార్టీ కండువాలువేసి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలకతీతంగా రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని మంత్రి నాదెండ్ల కోరారు. జనసేనపార్టీ సిద్ధాంతాలు, అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ నాయకత్వం, ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై వైసీపీని వీడి జనసేనలో చేరినట్లు ఎంపీటీసీ సభ్యులు తెలిపారు. పార్టీ లో చేరిన ఇన్‌చార్జి ఎంపీపీ బందిలి విరీష ఎంపీటీసీలు వాసంశెట్టి సత్యవతి, కేతా సూర్యచంద్ర, గుత్తుల శ్రీనివాసరావు, గుత్తుల సత్తిబాబు, మామిడాల నాగచక్రంకుపార్టీ కండువాలువేసి మంత్రి నాదెండ్ల, ఎమ్మెల్యే నానాజీ ఆహ్వానించారు.

## జనసేన ఖాతాలో ఎంపీపీ

మండలంలో 18 ఎంపీటీసీ సభ్యులు ఉండగా, 15మంది వైసీపీనుంచి ఎంపీటీసీలుగా ఎన్నికకాగా, ముగ్గురు జనసేన నుంచి ఎన్నికయ్యారు. ఎంపీపీ పదవికి కొవ్వాడ ఎంటీపీసీ గోపిశెట్టి పద్మజ, సర్పవరం ఎంపీటీసీ పుల్ల వెంకటలక్ష్మిలు పోటీపడగా, అధిష్టానం గోపిశెట్టి పద్మజ పేరును ఖరారు చేసింది. చెరో రెండున్నర ఏళ్ల ఎంపీపీ పదవి పంచుకునేలా జంటిల్‌మెన్ ఒప్పందం చేసుకున్నారు. ఎనిమిది నెలల కిందట ఎంపీపీ పదవికి గోపిశెట్టి పద్మజ రాజీనామా చేయడంతో ఎంపీపీ పదవి ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నేపథ్యంలో జనసేనకు చెందిన ఎమ్మెల్యే పంతం నానాజీ ఎంపీపీ పదవి కోసం వ్యూహాత్మకంగా పావులు కదిపారు. వైసీపీకి చెందిన ఆరుగురు ఎంపీటీసీలు జనసేనపార్టీలో చేరారు. దాంతో ఇప్పటివరకు వైసీపీకి ఉన్న 15 ఎంపీటీసీ సభ్యుల్లో 6 గురు జనసేనలో చేరగా 9మందికి పరిమితమైంది. దీంతో వీరి చేరికతో బలం 9కి చేరింది. పండూరుకు చెందిన ఎంపీటీసీ సభ్యులు నందిపాటి వెంకట శ్రీనివాస్ జనసేన పార్టీలో చేరుతున్నారన్న ఊహాగానాలు వినిపించడంతో 10మందితో జిల్లాలోనే జనసేన పార్టీకి చెందిన తొలిసారిగా ఎంపీపీ పీఠాన్ని కైవసం చేసుకోనుందని రాజకీయ నాయకులు విశ్లేషిస్తున్నారు. ఈనెల 27న జరిగే ఎన్నికకు హాజరు కాకుండా గైరుహాజరై పరోక్షంగా జనసేనకు మద్దతు ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యేకు మరో ఇద్దరు వైసీపీ ఎంపీటీసీ సభ్యులు హామీ ఇచ్చినట్లు తెలిసింది.

# 17 మందికి సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రెవెన్యూ విభాగంలో 17మంది జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగా పదోన్నతి లభించింది. ఈమేరకు ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా నోడల్ అధికారి, కాకినాడజిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఉత్తర్వులు ఇచ్చారు. పదోన్నతి పొందిన వారిలో జేవీవీఎస్ఎస్ విశ్వనాధ్, కె.అశోక్‌బాబ్జి, ఎస్.రాజారవి చంద్రశేఖర్, పి.సతీష్, సీహెచ్ శిరీష, కె.రవికుమార్, ఆర్.నాగూర్ మీరా, డి.శ్రీరవితేజ, జి.కృష్ణకాంత్, ఎం.రవికిరణ్, కె.సాయికుమార్, ఎం.నితిన్‌కుమార్, ఎం.జాకబ్, సీహెచ్‌టీవీవీ సత్యకాంత్, ఎన్.దుర్గవెంకటేష్, టి.లోహిత్ సాయి, కె.మురళీకృష్ణలు ఉన్నారు. ఉత్తర్వులు తీసుకున్న 15 రోజుల్లో కేటాయించిన పోస్టుల్లో చేరాలని ఆదేశించారు.

# మే లో అమెరికాకు జేఎన్టీయూకే వీసీ ప్రసాద్

జేఎన్టీయూకే, మార్చి21(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ మేలో అమెరికా వెళ్లనున్నారు. దీనికి సంబంధించి 10 నుంచి 17వ తేదీవరకూ మే నెలలో సెలవుకోరగా ప్రభుత్వం మంజూరు చేసింది. అయితే వీసీ తన వ్యక్తిగత పనులకోసం అమెరికా వెళ్లనున్నారు. ఆ పీరియడ్‌లో విశాఖపట్నం ఆంధ్రావిశ్వవిద్యాలయం వీసీ జీపీ రాజశేఖర్ జేఎన్టీయూకే ఇన్‌చార్జ్ వీసీగా వ్యవహరిస్తారని సమాచారం.

## మతసామరస్యానికి ప్రతీక
# నిర్మలగిరి పుణ్యక్షేత్రం



నిర్మలగిరి పుణ్యక్షేత్రంలో మేరీమాత ఆలయం

**నేటి నుంచి 25 వరకు ఘనంగా ఉత్సవాలు**
**క్రైస్తవులతో పాటు తరలిరానున్న హిందువులు**

దేవరపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మతసామరస్యానికి ప్రతీకగా నిర్మలగిరి మేరీమేత పుణ్యక్షేత్రం ఎంతో పేరుగాంచింది. తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం గౌరీపట్నంలోని ఈ మేరీ మేత పుణ్యక్షేత్రం ఉత్సవాలకు ఏటా భారీసంఖ్యలో భక్తులు వస్తుంటారు. గత 40ఏళ్లుగా నిర్మలగిరి ఉత్సవాలు ప్రతీ ఏడాది మార్చి 22 నుంచి 25వరకు ఘనంగా నిర్వహిస్తుంటారు. ఈ నేపథ్యంలో పుణ్యక్షేత్రంలో శనివారం జరిగే ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లను ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు, పుణ్యక్షేత్ర డైరక్టర్ జాన్‌పీటర్ చేశారు.

**ఇదీ ఆలయ చరిత్ర...**

ఏలూరు పీఠాధిపతి జాన్‌ములగాడ ఏలూరు నుంచి విశాఖపట్నం వెళ్తూ మార్గమధ్యలో గౌరీపట్నం సమీపంలో కారుకు అంతరాయం ఏర్పడటంతో ఆ ప్రాంతంలో పీఠాధిపతికి మేరీమాత సాక్షాత్కరించి తనకు ఆలయం నిర్మించాలని ములగాడకు ఆలోచింపచేశారు. దీంతో గౌరీపట్నం హైవే పక్కన గల కొండ వద్ద ఆలయ నిర్మాణానికి సమయాత్తం మయ్యారు. గౌరీపట్నం ప్రముఖులు గ్రామపెద్దలతో సంప్రదించి భూసేకరణ చేసి ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అప్పటి నుంచి కొండపైన ఆలయాన్ని, రోడ్డు పక్కన గేటు సమీపంలో మేరీమాత మందిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ పుణ్యక్షేత్రాన్ని క్రైస్తవులతో పాటు హిందువులు కూడా దర్శించుకోవడం విశేషం. క్షేత్ర డైరెక్టర్‌గా ఫాదర్ ఆరోన్ దిరిసన బాధ్యతలు చేపట్టి ప్రధాన ఆలయాన్ని నిర్మించారు. 2000 సంవత్సరంలో నిర్మలగిరి పుణ్యక్షేత్రంలో అన్ని హంగులతో ప్రధాన దేవాలయం నిర్మాణం జరిగింది. ఈ క్రమంలో ఏలూరు పీఠాధిపతిగా బాధ్యతలు చేపట్టిన పొలిమేర జయరావు ఆధ్వర్యంలో పుణ్యక్షేత్ర డైరెక్టర్‌గా ఫాదర్ రాయప్ప బాధ్యతలు చేపట్టారు. క్షేత్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ప్రధానంగా రోడ్లు, కళావేదిక, భక్తులు వెళ్లే మార్గంలో చెట్లు నాటించారు. ఈ ఆలయంలో ముఖ్యంగా తలనీలాలు సమర్పించడం, కొబ్బరి కాయలు కొట్టడం, లడ్డూలు భక్తులు అందజేయడం, కొవ్వొత్తులు వెలిగించడం చేస్తుంటారు. ఇక్కడ నిత్యాన్నదానం అన్ని సౌకర్యాలతో ఏర్పాటు చేశారు. అన్నదాన కాంట్రాక్టర్ కళ్లే నాగేశ్వరరావు భక్తులు సౌకర్యార్థం కూలింగ్‌వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ పుణ్యక్షేత్రం ఆధ్వర్యంలో నిర్మల హృదయ జూనియర్ కాలేజీ, డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేశారు. ఈ నెల 22 నుంచి 25 వరకు నిర్మలగిరి మేరీమాత ఉత్సవాలను భారీ ఎత్తున నిర్వహించడానికి పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్‌పీటర్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ పుణ్యక్షేత్రంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీసీ కెమెరాలు, 200మంది వలంటీర్లను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. ఈ ఉత్సవాలకు పలు రాష్ట్రాల నుంచి పీఠాధిపతులు హాజరవుతారని చెప్పారు.


గౌరీపట్నం నిర్మలగిరి పుణ్యక్షేత్రం ప్రధాన ఆలయం

# సత్యదేవుని ఆలయ పునఃనిర్మాణ ప్రారంభం దినోత్సవం


పండితులను సత్కరిస్తున్న ఆలయ ఈవో సుబ్బారావు

అన్నవరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుని ఆలయం పునఃనిర్మించి 13 ఏళ్ల పూర్తిచేసుకుని 14వ ఏటా అడుగిడిన సందర్భాని పురస్కరించుకుని శుక్రవారం ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. మూలవరులకు అభిషేకం అనంతరం స్వామివారికి లక్ష పత్రిపూజ, అమ్మవారికి లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయాన్ని వివిధ సుగంధభరిత పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అధికసంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. 2012 ఆలయ శిఖర ప్రతిష్ఠలో పాలుపంచుకున్న ఆరుగురు పండితులకు ఈవో వీర్ల సుబ్బారావు దుశ్శాలువా కప్పి పుష్పమాలాంకృతలను చేసి నగదు పురస్కారంతో సత్కరించారు. సత్కారం అందుకున్నవారిలో ఆకొండి వ్యాసమూర్తి, గొర్తి సుబ్రహ్మణ్య ఘనాపాఠి, గాడేపల్లి సత్యనారాయణ తదితరులున్నారు.

- పండితులు, అర్చకులకు ఘన సత్కారం

### మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి పూజలు

సత్యదేవుని సన్నిధిలో శుక్రవారం మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శివజ్ఞానం కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ సహాయ కమిషనర్ రామ్మోహనరావు, పీఆర్వో కృష్ణారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేయగా అధికారులు స్వామివారి చిత్రపటం, మెమెంటో అందజేశారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భాస్కరప్రసాద్ తదితరులున్నారు.


సత్యదేవుని దర్శనానంతరం న్యాయమూర్తి

## ఎట్టకేలకు ప్రసాద్ స్కీం పనులకు టెండర్లు ఖరారు

అన్నవరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుని సన్నిధిలో భక్తుల సౌకర్యార్థం కేంద్రప్రభుత్వ పథకం ప్రసాద్ స్కీం పనులకు సంబంధించి టెండర్లు ఖరారైనట్టు టూరిజంశాఖ అధికారులు తెలిపారు. సుమారు రూ.25.32 కోట్ల అంచనాలతో రూపొందించిన ఈ పనులకు సుమారు ఏడాది క్రితం ప్రధాని నరేంద్ర మోదీ జమ్మూ కాశ్మీర్ నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం వీటికి టెండర్లు పిలవగా సాంకేతిక కారణాలతో వీటిని నిలుపుదల చేసి రీటెండర్లను పిలిచారు. రూ.25.32 కోట్లతో పిలిచిన టెండర్లను విశాఖపట్నంకు చెందిన ఒక సంస్థ టెండర్ 16శాతం తక్కువకు కోడ్ చేసి టెండర్ దక్కించుకుంది. త్వరలో అగ్రిమెంట్ పూర్తిచేసి పనులు ప్రారంభిస్తామని తెలిపారు. వీటితో ప్రధానంగా నూతన అన్నదాన భవనం, క్యూ కాంప్లెక్స్, మరుగుదొడ్లు, 2 ఎలక్ట్రికల్ బస్సులు, చార్జింగ్‌స్టేషన్లు ఏర్పాటుకానున్నాయి. ఈ పనులకు దేవస్థానానికి ఏ సంబంధం ఉండదు. టూరిజంశాఖ ఆధ్వర్యంలోనే చేపట్టనున్నారు.

### రెండు బోర్లకు భూమిపూజ

**ఏలేరు నీటిని రిజర్వాయర్‌లోకి మళ్లింపు అంశంపై అసంపూర్తిగా సమావేశం**

వేసవిలో భక్తులకు నీటి సమస్యలు ఏర్పడకుండా త్వరితగతిన రూ.10లక్షలతో 2 బోర్లు ఏర్పాటు కు శుక్రవారం ఈవో వీర్ల సుబ్బారావు భూమిపూజ నిర్వహించారు. ఈ 2 బోర్ల ద్వారా నీటిని సత్యగిరి కొండపై వాటర్‌ట్యాంక్‌కు చేర్చి హరిహరసదన్, శివసదన్, విష్ణుసదన్, అతిథి గృహాలు, ఉచిత కల్యాణమండపాలకు అందజేయడం జరుగుతుందని ఈవో తెలిపారు. మరో పక్క పంపాజలాశయంలోకి ఏలేరు నీటిని రిజర్వాయర్‌లోకి మళ్లించే విషయమై జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌తో ఇరిగేషన్, పోల వరం అధికారులు నిర్వహించిన సమావేశం అసంపూర్తిగా ముగిసింది. పోలవరం పనులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక పైప్‌లైన్ ఏర్పాటుకు అంచనాలు రూపొందించి అందజేస్తామని, దీని నిధులు ఇప్పించాలని పోలవరం అధికారులు కోరారు. సుమారు రూ.40 లక్షలు వ్యయమవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు.

# ఇళ్ల స్థలాలు ఇవ్వాల్సిందే

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్
- కొత్తపల్లి మండలం కొమరగిరి ఇళ్ల స్థలాల లేఅవుట్ వద్ద నిరసన
- ర్యాలీకి అనుమతి లేదని అడ్డుకున్న పోలీసులు


కొమరగిరిలో పేదలకు స్థలాలు మంజూరు చేయాలని ఆందోళన చేపట్టిన సీపీఎం నాయకులు

కొత్తపల్లి, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వెంటనే నిరుపేదలకు ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని కోరుతూ సీపీఎం రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆధ్వర్యంలో కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం కొమరగిరి మెగా ఇళ్ల స్థలాల కాలనీ వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టారు. తొలుత ఆనందనగరం నుంచి కొమరగిరి జగనన్న మెగా ఇళ్లకాలనీ వద్దకు వెళ్లడానికి అనుమతి లేదని కొత్తపల్లి పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం ఆందోళనకారులతో కలిసి సీపీఐ కార్యదర్శి రామకృష్ణ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ పిఠాపురం నియోజకవర్గ సమస్యలపై స్థానిక తహశీల్దార్‌ను కలిసి చర్చించేందుకు వెళ్లనివ్వకుండా పోలీసులు అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. వైసీపీ ప్రభుత్వం నిరుపేదలకు ఇళ్లస్థలాల మంజూరు కోసం కొనుగోలు చేసిన భూమిని వైసీపీ నాయకులు అధికారులతో కుమ్మక్కై పలువురు రైతులకు కౌలుకు ఇచ్చి సాగు చేయడంపై రామకృష్ణ మండిపడ్డారు. నిరుపేదల ఇళ్లస్థలాల కోసం రైతులకు పరిహారం చెల్లించి కొనుగోలు చేసిన భూమిని కచ్చితంగా ప్రభుత్వానికే చెందుతుందన్నారు. దీనిపై ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చర్యలు చేపట్టి పేదలకు ఇళ్లస్థలాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ భూమిని కౌలుకు ఇచ్చేందుకు సహకరించిన అధికారులపై చర్యలు చేపట్టాలని, లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీపీఐ నాయకులు సాకా రామకృష్ణ, తాటిపాక మధు, లోడ అప్పలరాజు, తోకల ప్రసాద్, కేశవరపు అప్పలరాజు, ఎ.భవాని, బల్ల సురేష్, కేతా గోవిందు, వి.గురవయ్య, ఝాన్సీ పాల్గొన్నారు.

### శతాధిక వృద్ధురాలు మృతి


సుబ్బయ్యమ్మ (ఫైల్)

దేవీపట్నం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవారం గ్రామ పంచాయతీ పరిధి పోతవరం గ్రామం ఆదివాసీ కుల శతాధిక వృద్ధురాలు కుంజం సుబ్బయ్యమ్మ(110) శుక్రవారం మృతిచెందారు. మూడు తరాలు చూసిన సుబ్బయ్యమ్మ అంగన్‌వాడీ ఆయాగా ఎంతో మందికి వంట చేసి వడ్డించారు.



# ఆరేళ్లుగా బిల్లులు చెల్లించడం లేదు

**కాకినాడ కలెక్టరేట్ వద్ద ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల కాంట్రాక్టర్ల ధర్నా**

కలెక్టరేట్(కాకినాడ), మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఆరేళ్లుగా చేసిన పనులకు బిల్లులు చెల్లించడం లేదని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఉమ్మడి తూర్పుగోదావరి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల కాంట్రాక్టర్లు, మున్సిపల్ కాంట్రాక్టర్లు కాకినాడ కలెక్టరేట్ ఎదుట శుక్రవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్ఎస్ శాంతారామ్ మాట్లాడుతూ కాంట్రాక్టర్ల ప్రస్తుత ఆర్థిక పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. బిల్లులు చెల్లించకపోవడం వల్ల తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. కొత్త పనులకు టెండర్లు వేయలేకపోతున్నామన్నారు. తమ సమస్యలను పరిష్కరించడానికి పెండింగ్ బిల్లులను సకాలంలో చెల్లించడానికి వీలుగా సీఎఫ్ఎంఎస్ నిధి పోర్టల్‌లో సాంకేతిక అడ్డంకులను పరిష్కరించాలన్నారు. ఆర్ అండ్‌బీ విభాగంలో రూ.1350కోట్ల నాబార్డుతో సహా వివిధ ప్రణాళికల కింద నిధుల క్లియరెన్స్ చేయాలన్నారు. అదనంగా బడ్జెట్ కేటాయింపులు లేకపోవడం వల్ల అప్‌లోడ్ చేయని బిల్లుల మొత్తం రూ.500కోట్లు ఉన్నాయన్నారు. పంచాయతీరాజ్ విభాగంలో పెండింగ్‌లో ఉన్న బిల్లులు రూ.800కోట్లు ఉన్నాయన్నారు. ఇతర విభాగాల్లో రూ.5వేలకోట్ల బిల్లులు క్లియరెన్స్ చేయాల్సిఉందని శాంతారామ్ తెలిపారు. తొలుత ర్యాలీ కాకినాడ శారదాదేవి గుడి వద్ద ఉన్న మున్సిపల్ కార్యాలయం నుంచి బయలుదేరి కాకినాడ కలెక్టరేట్‌కు చేరింది. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు బాలకృష్ణ, ప్రకాష్‌రావు, ప్రసాద్‌రావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కాంట్రాక్టర్లు

## మోతుగూడెం పోలీస్‌స్టేషన్ చెక్‌పోస్టు వద్ద
# సీఆర్పీఎఫ్ విస్తృత తనిఖీలు


వాహనాలు తనిఖీ చేస్తున్న దృశ్యం

మోతుగూడెం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెం శుక్రవారం జరిగిన ఛత్తీస్‌ఘడ్‌లోని బస్తర్ డివిజన్లో రెండు భారీ ఎదురుకాల్పులు ఘటనలో 30మంది మావోయిస్టులు మృతి చెందారు. ఒకజవాను వీరమరణం పొందారు. ఈ నేపథ్యంలో మోతుగూడెం పోలీస్‌స్టేషన్ చెక్‌పోస్టు వద్ద శుక్రవారం విస్తృతంగా వాహనాలను తనిఖీలు చేశారు. ప్రయాణికుల బ్యాగ్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానుతులను ప్రశ్నించి విడిచిపెట్టారు. మోతుగూడెం నుంచి సుకుమామిడి నుంచి నేలకోట వెళ్లే మార్గంలో సీఆర్పీఎఫ్ బెటాలియన్ బలగాలు దారి పొడవునా తనిఖీలు నిర్వహించారు. ట్రైనింగ్ ఎస్ఐ సీతారాం ఆధ్వర్యంలో తనిఖీలు జరిపారు. మోతుగూడెం సుకుమామిడి మార్గాల వైపు నుంచి వచ్చే వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించారు. నేలకోట సరిహద్దు ప్రాంతాల్లో సీఆర్పీఎఫ్ బలగాలు నిఘా పెట్టాయి. తనిఖీల్లో సీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ధరం ప్రకాష్, సీఆర్పీఎఫ్ ఏ/41 బెటాలియన్ సిబ్బంది, సివిల్ పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.


సరిహద్దు ప్రాంతాల్లో సీఆర్పీఎఫ్ బలగాల తనిఖీ

## బాలికపై అత్యాచారం..
# 50 ఏళ్ల వ్యక్తికి ఐదేళ్ల జైలు

అయినవిల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయిన విల్లి మండలంలో ఓ మూడేళ్ల బాలికపై అత్యాచారం చేసిన కేసులో నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.వెయ్యి జరిమానా విధిస్తూ కాకినాడ పోక్సో కోర్టు జడ్జి కె.శ్రీదేవి తీర్పు ఇచ్చినట్టు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు తెలిపారు. వివరాల ప్రకారం.. 2023 మే 11న ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో అదే గ్రామానికి చెందిన డెక్క రాంబాబు (50) బాలికకు చాక్లెట్ ఇస్తానని ఆశ చూపించి మాయమాటలు చెప్పి తన ఇంట్లోకి తీసుకువెళ్లి గడియ పెట్టాడు. చుట్టుపక్కలవారు చూసి రాంబాబు ఇంటి తలుపులు పగులకొట్టి బాలికను పిలిచారు. బాలికను బయటికి పంపించి అక్కడి నుంచి రాంబాబు పరారయ్యాడు. జరిగిన ఘటనను బాలిక తన తల్లికి ఏడుస్తూ చెప్పగా అదేరోజు అప్పటి ఎస్ఐ ఎస్.నాగేశ్వరరావు అయినవిల్లి పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అప్పటి కొత్తపేట డీఎస్పీ కేవీ రమణ దర్యాప్తు చేసి రాంబాబును అరెస్టుచేసి పూర్తి సాక్ష్యాధారాలతో కోర్టులో హాజరుపరుచగా రిమాండు విధించారు. కాకినాడ పోక్సో కోర్టులో కేసు ట్రయల్ నిర్వహించారు. పీటీ జి.వెంకటరత్నంబాబు ప్రాసిక్యూషన్ తరపున వాదనలు వినిపించారు. వాదోపవాదాలు అనంతరం రాంబాబుపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి శ్రీదేవి నింది తుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. మహిళలు, చిన్నపిల్లలపై అఘాయిత్యాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, కఠినచర్యలు తీసుకుంటామని తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ కృష్ణారావు హెచ్చరించారు. సీఐ రుద్రరాజు భీమరాజు, సిబ్బందిని అభినందించారు.

# గ్యాస్ సిలిండర్ లీకై పెంకుటిల్లు దగ్ధం

**దంపతులకు గాయాలు**


వడిశలేరులో కాలిపోయిన పెంకుటిల్లు

రంగంపేట,మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ సిలిండర్ వద్ద మంటలు చెలరేగడంతో పెంకుటిల్లు దగ్ధమైంది. భార్యాభర్తకు గాయాలయ్యాయి. వీఆర్వో టి.అశ్విని వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా రంగంపేట మండలం వడిశలేరులోని బీసీ కాలనీలో గోనబోయిన సత్యనారాయణ, గోనబోయిన శ్రీనుల కుటుంబాలు ఓ పెంకుటింట్లో నివాసముంటున్నాయి. శుక్రవారం ఉదయం 11.30 సమయంలో సత్యనారాయణ భార్య గంగారత్నం వంట చేస్తుండగా గ్యాస్ సిలిండర్ లీకై మంటలు చెలరేగాయి. ఇంటికి నిప్పంటుకుని 2కుటుంబాలకు చెందిన గృహోపకరణ వస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. సత్యనారాయణ, గంగారత్నం ముఖం, కాళ్లు కాలిపోయాయి. వారిని ఆసుపత్రికి తరలించారు. ఘటనలో సుమారు 1,50,000 ఆస్తి నష్టం జరిగినట్టు వీఆర్వో పేర్కొన్నారు. కాగా తక్షణ సాయంగా తహశీల్దార్ కోసు అనసూయ 2 కుటుంబాలకు బియ్యం, పంచదార సమకూర్చి అందజేశారు.

### మహిళ మెడలో బంగారు గొలుసు దొంగిలించిన వ్యక్తి అరెస్టు

కొవ్వూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో బంగారు గొలుసు దొంగిలించిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు కొవ్వూరు డీఎస్పీ జి.దేవకుమార్ తెలిపారు. పోలీసులు వివరాల ప్రకారం.. ఈ నెల 19న తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు పట్టణంలోని ఏసీఆర్ లాడ్జి సమీపంలోని పాలింపాటి నరసయ్యనగర్‌లో 23వ వార్డు చిట్టూరివారి వీధికి చెందిన కుందుల పద్మకుమారి సాయంత్రం సమయంలో వాకింగ్ చేస్తుంది. సీతంపేట మండలం కాటవరానికి చెందిన బొద్దు సూర్యనారాయణ అలియాస్ సూరి అనే వ్యక్తి వెనుక నుంచి వచ్చి పద్మకుమారి మెడలోని ఆరున్నర కాసుల రెండుపేటల బంగారపు గొలుసును లాక్కుని బైక్‌పై వెళ్లిపోయాడు. సమాచారం తెలుసుకున్న డీఎస్పీ దేవకుమార్, పట్టణ సీఐ పి.విశ్వం, ఎస్ఐ కె.జగన్మోహనరావు సంఘటనా స్థలానికి చేరుకుని బాధితురాలి నుంచి వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు డీఎస్పీ దేవకుమార్ పర్యవేక్షణలో సూర్యనారాయణను శుక్రవారం దొమ్మేరు అండర్ పాస్ వద్ద అరెస్టు చేసి అతడి వద్ద నుంచి బంగారపు గొలుసును పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అతడిని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపర్చామన్నారు. త్వరగా దొంగతనం కేసును చేధించి నిందితుడిని అరెస్టు చేయడంతో సీఐ పి.విశ్వం, ఎస్ఐ కె.జగన్మోహనరావును జిల్లా ఎస్పీ అభినందించినట్టు డీఎస్పీ చెప్పారు.

## ఒక్క చేప రూ.10వేలు

కాకినాడ కుంభాభిషేకం బీచ్ వద్ద శుక్రవారం ఒక మత్స్యకారుడి వలకు 60 కిలోల బరువు గల కొమ్ముకోనం చేప పడింది. ఇది సుమారు రూ.10 వేల వరకు ధర పలుకుతుందని, కేరళకు ఎగుమతి చేస్తామని అతడు చెప్పడం విశేషం.
– ఫొటోగ్రాఫర్, కాకినాడ



## తల్లిదండ్రులను చూసేందుకు వచ్చి...

**మోటారు సైకిల్ అదుపుతప్పి వ్యక్తి మృతి**


సతీష్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

రాయవరం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు రాయవరం ఎస్ఐ డి.సురేష్‌బాబు తెలిపారు. శుక్రవారం రాయవరంలో ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఏడిద గ్రామానికి చెందిన చొక్కా సతీష్ (35) కాకినాడలో ఒక చికెన్ దుకాణంలో పనిచేస్తున్నాడు. ఏడిదలో తల్లిదండ్రులను చూసేందుకు వచ్చి శుక్రవారం ఉదయం సతీష్ తిరిగి మోటారుసైకిల్‌పై కాకినాడ వెళ్తుండగా మాచవరం -పసలపూడి ప్రధాన రహదారిలో ఇటుకల బట్టీ వద్దకు వచ్చేసరికి సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని సతీష్ ఢీ కొనడంతో మోటారు సైకిల్ అదుపుతప్పి పడిపోవడంతో సతీష్ తలకు గాయమై సంఘటనా స్థలంలో మృతిచెందినట్టు ఎస్ఐ పేర్కొన్నారు. సంఘటనా స్థలాన్ని రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్, మండపేట రూరల్ సీఐ పి.దొరబాబు పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

### చెట్టుపై నుంచి జారి పడి ఆదివాసీ బాలిక మృతి

ఎటపాక, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు జారి పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆరోగ్య పరిస్థితి విషమించి ఆదివాసీ బాలిక మృతి చెందిన ఘటన శుక్రవారం ఎటపాక మండలం చింతలపాడు వలస ఆదివాసీ గ్రామంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మడివి జ్యోతిలక్ష్మి( 12) ఐదురోజుల క్రితం అటవీ ప్రాంతంలోకి తునికి కాయలు ( పండ్లు) సేకరణకు వెళ్లింది. చెట్టు ఎక్కి అక్కడ నుంచి ప్రమాదవశాత్తు జారి పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. ముందుగా లక్ష్మీపురం పీహెచ్‌సీకి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ తరలించారు. అయితే చికిత్స పొందుతూ బాలిక శుక్రవారం మృతి చెందింది.

### పాటు కాటుకు ఉపాధి కూలీ మృతి

కిర్లంపూడి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం కృష్ణవరం గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా శుక్రవారం పంటకాలువ పూడిక తీత పనిచేస్తున్న ఉపాధి కూలీ నీలాద్రి అప్పారావు(53) పాముకాటుకు గురయ్యాడు. వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడని స్థానికులు తెలిపారు.

### ఏలూరు రేంజ్‌లో 31 మంది ఏఎస్ఐలకు పదోన్నతి

ఏలూరు క్రైం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఏలూరు రేంజ్‌లో ఏఎస్ఐలుగా పని చేస్తున్న 31 మందికి ఎస్ఐలుగా పదోన్నతి కల్పిస్తూ ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇద్దరు ఏఆర్ఎస్ఐలకు ఆర్ఎస్ఐలుగా పదోన్నతి కల్పించారు. అల్లూరు సీతారామరాజు జిల్లాలో ఆరుగురు, కాకినాడ జిల్లాలో నలుగురు, కోనసీమ జిల్లాలో 8మందికి, తూర్పుగోదావరి జిల్లా 8మంది, ఏలూరు జిల్లా ముగ్గురికి ఎఎస్ఐల నుంచి ఎస్ఐలుగా, ఎన్టీఆర్ జిల్లాలో ఎఆర్ఐ ఎస్ఐలకుఆర్ఎస్ఐలుగా పదోన్నతికల్పించారు.

### ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్నారని ప్రశ్నించినవారిపై దాడి

**ఇద్దరికి తీవ్ర గాయాలు**

గొల్లప్రోలు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్నారని ప్రశ్నించిన వారిపై దాడికి దిగడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. కాకినాడ జిల్లా గొల్లప్రోలు బైపాస్‌రోడ్డులో తాటిపర్తి పుంతరోడ్డు జంక్షన్‌కు సమీపంలో శుక్రవారం ఈ సంఘటన జరిగింది. బైపాస్‌రోడ్డులో ఇద్దరు వ్యక్తులు మోటార్‌సైకిల్‌పై వస్తూ ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్నారు. ఇది సరైన పద్ధతి కాదని ఆ మార్గంలో వెళ్తున్న తాటిపర్తికి చెందిన మురాలశెట్టి సూర్యతేజ, పేకేటి ప్రసాద్ వారిని ప్రశ్నించారు. ఇదే సమయంలో ఆ వ్యక్తులకు సంబంధించిన మరికొందరు వచ్చి సూర్యతేజ, ప్రసాద్‌పై దాడికి దిగారు. వారికి తీవ్రగాయాలవ్వగా చికిత్స నిమిత్తం పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గొల్లప్రోలు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

**సఖినేటిపల్లి-నర్సాపురం రేవు పాట**
### రూ.4,18,18,959కు టెండరు ఖరారు

అంతర్వేది, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి-నర్సాపురం మాధవాయపాలెం ఫెర్రీ సంవత్సరానికి టోల్ వసూలు హక్కులు పొందేందుకు శుక్రవారం బహిరంగ టెండరు వేలం నర్సాపురం మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. హెచ్చు పాటదారుడైన శ్రీవిఘ్నేశ్వర కోఆపరేటివ్ బోట్స్ సొసైటీ టేకిశెట్టివారిపాలెం పేరున రూ.4,18,18,959కు వేలం ఖరారైందని సఖినేటిపల్లి ఎంపీపీ వీరా మల్లికార్జునరావు, ఎంపీడీవో ఇన్‌చార్జి ఎఫ్ఏసీ కె.సూర్యనారాయణ తెలిపారు. గ్రామ పంచాయతీ అధికారి పి.బొజ్జిరాజు, జడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, నర్సాపురం మండల పరిషత్ అధికారులు ఉన్నారు.

### శుక్రవారం ప్రత్యేక నమాజులు
మామిడికుదురు, మార్చి21(ఆంధ్రజ్యోతి): రంజాన్ నెల మూడో శుక్రవారం పురస్కరించుకుని ముస్లింలు ప్రత్యేక నమాజులు చేశారు. సున్నీ జామియా మసీదులో మత ప్రబోధకుడు తారిఖ్ అన్వర్‌రజ్వీ, షియాజామియా మసీదులో షబ్బర్ అలీజైదీలు మూడో శుక్రవారం ప్రాముఖ్యతను వివరించారు. ముస్లింలు ప్రార్థనలు నిర్వహించారు.

### తెలుగును ద్వితీయ భాషగా కొనసాగించాలి
అమలాపురంటౌన్, మార్చి21(ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్‌లో తెలుగును ద్వితీయ బాషగానే కొనసాగించాలని అమలాపురం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలోజరుగుతున్న ఇంటర్ మూల్యాంకన కార్యక్రమంలో భాగంగా అధ్యాపకులు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వనుము సోమశేఖర్‌ను కలిసిశుక్రవారం వినతిపత్రం అందించారు.

## పౌష్టికాహారం అందించడంలో జాగ్రత్తలు తీసుకోవాలి
**ఐసీడీఎస్ పీడీ శాంతకుమారి**


శిబిరంలో మాట్లాడుతున్న పీడీ శాంతకుమారి

ముమ్మిడివరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): చిన్న పిల్లలు, తల్లులకు సక్రమంగా పౌష్టికాహారం అందించడంలో అంగన్‌వాడీ కార్యకర్తలు జాగ్రత్తలు తీసుకోవాలని ఐసీడీఎస్ పీడీ డి.శాంతకుమారి సూచించారు. పోషణ బి పడాయీ బి కార్యక్రమంలో భాగంగా ముమ్మిడివరం ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో సీడీపీవో ఐ.విమల అధ్యక్షతన నిర్వహించిన శిక్షణ శిబిరంలో పీడీ శాంతకుమారి పాల్గొని మాట్లాడారు. ఐదేళ్లలోపు పిల్లలకు విధిగా తల్లిపాలు అందించాలని, తల్లి పాల ప్రాముఖ్యతను తల్లులకు వివరించాలని సూచించారు. తల్లులు, పిల్లలకు పౌష్టికాహారం సక్రమంగా అందిస్తూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలన్నారు. ఈసందర్భంగా పీడీ సత్యకుమారి, సీడీపీవో విమలలు తల్లిపాల ప్రాముఖ్యత, ఐదేళ్లలోపు పిల్లల పెరుగుదల ప్రాముఖ్యతపై అంగన్‌వాడీలకు సలహాలు, సూచలనలిచ్చారు. ఈవోపీఎస్‌లు జీవీఎస్ఎన్ దేవి, సీహెచ్ పల్లవి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## వర్గీకరణకు వ్యతిరేకంగా రిలే దీక్షలు

కాట్రేనికోనలో దీక్ష చేస్తున్న మాలమహానాడు నాయకులు

కాట్రేనికోన, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ శుక్రవారం మాలమహానాడు ఆధ్వర్యంలో కాట్రేనికోనలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. వర్గీకరణ విషయంలో ప్రభుత్వ వెనక్కి తగ్గకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈదీక్షల్లో నల్లా నరసింహమూర్తి, ఇసుకపట్ల రాంబాబు, వడ్డి శ్యాంప్రసాద్, అయితాబత్తుల శ్రీనుబాబు, గెల్లా రాజేంద్ర, వాకపల్లి భీమారావు, బడుగు భీమేష్, వడ్డి అంబేడ్కర్, నందిక క్రాంతికుమార్, అయితాబత్తుల బాబ్జి, బండి మరిడేష్, పోలిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

### మాలమహానాడు నిరసన
పి.గన్నవరం, మార్చి 21(ఆంధ్రజ్యోతి):ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాలమహానాడు మండల నాయకులు పి.గన్నవరం సెంటర్‌లో శుక్రవారం నిరసన చేపట్టారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వర్గీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్య క్రమంలో మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి, నక్కా వెంక టేశ్వరరావు, సాధనాల రమేష్, యన్నాబత్తుల నాగరాజు, యన్నపు పెద్ద, కొంబత్తుల ఏసు, కుసుమ వెంకటేశ్వరరావు, పులపర్తి రాజారావు, వడలి కొండయ్య, బీర బాపూజీ, పుచ్చకాయల సత్యనారాయణ, కోట విజయభాస్కర్, కొక్కిరి రవికుమార్, గిడ్డి రాంబాబు, కాండ్రేగుల అనంతబాబు, చిలకపాటి శ్రీను, కోట రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

### కుల గణన తర్వాత వర్గీకరణ చేయాలి
రాజోలు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభలో చర్చ జరపకుండా ఎస్సీ వర్గీకరణ బిల్లును ఆమోదించడం ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టు అని దళిత చైతన్యవేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ అన్నారు. రాజోలులో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులను విభజించి మాల సామాజికవర్గాన్ని అణగదొక్కడమే లక్ష్యంగా అన్ని రాజకీయ పార్టీలు కుట్ర పన్నడం దురదృష్టకరమన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చేపట్టిన 2011జనాభా లెక్కల ప్రకారం వర్గీకరణ చేయడం దుర్మార్గమన్నారు. తాజాగా కులగణన చేసిన తర్వాత వర్గీకరణ చేయాలన్నారు.

## స్వచ్ఛాంధ్ర లక్ష్యాన్ని నెరవేర్చాలి

మాట్లాడుతున్న ఈవోపీఆర్డీ సీహెచ్ లక్ష్మీకల్యాణి

ముమ్మిడివరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సాలిడ్‌వేస్ట్ ప్రోసెసింగ్ సెంటర్లను సక్రమంగా నిర్వహిస్తూ స్వచ్ఛంధ్రా లక్ష్యాన్ని నెరవేర్చాలని ముమ్మిడివరం, ఉప్పలగుప్తం ఈవోపీఆర్డీ సీహెచ్ లక్ష్మీకల్యాణి, జి.రాజ్‌కుమార్ సూచించారు. అనాతవరం పంచాయతీ పరిధిలోని సాలిడ్‌వేస్ట్ ప్రోసెసింగ్ సెంటర్ షెడ్డు వద్ద శుక్రవారం ఘన వ్యర్థాలపై ముమ్మిడివరం, ఉప్పలగుప్తం మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులకు, పారిశుధ్య సిబ్బందికి నిర్వహించిన శిక్షణ శిబిరంలో వారు మాట్లాడారు. గ్రామాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలన్నారు. ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తి చెప్పి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ ప్రతీ ఒక్కరు స్వచ్ఛంధ్రాలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో టీపీఆర్టీ పాము వెంకటేశ్వరరావు, అనాతవరం సర్పంచ్ మిమ్మితి చిరంజీవి, పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రలు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## యానాంలో బంద్ విజయవంతం

యానాంలో మూతపడిన వ్యాపార సంస్థలు

యానాం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): యానాంలో చెత్త తరలింపు డంపింగ్ యార్డు సమస్యను నిరసిస్తూ శుక్రవారం యానాం అన్నడీఎంకే శాఖ తలపెట్టిన బంద్ విజయవంతమైంది. ఈబంద్‌కు యానాంలోని వివిధ రాజకీయ పార్టీలతో పాటు వివిధ సంఘాలు స్వచ్ఛందంగా మద్దతు ఇవ్వడంతో షాపులన్నీ మూతపడ్డాయి. ప్రభుత్వ కార్యాలయాలు తప్ప మిగిలిన వ్యాపార సంస్థలు, పెట్రోలు బంకులు, మద్యం షాపులు, ప్రైవేటు పాఠశాలలు మూతపడ్డాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా సీఐ షణ్ముం నేతృత్వంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. యానాం బంద్‌కు సహకరించిన రాజకీయపార్టీల ప్రతినిధులకు, వివిధ సంఘాల ప్రతినిధులకు యానాం అన్నాడీఎంకే పార్టీ కార్యదర్శి మంచాల సత్యసాయి కుమార్, వర్తక సంఘం అధ్యక్షుడు నల్ల వెంకన్న కృతజ్ఞతలు తెలిపారు. త్వరగా యానాంలో చెత్త సమస్యకు పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని కోరారు.

## ఆక్వా చెరువుల తొలగింపు నిలుపుదల చేయాలి

కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న అంతర్వేది తీరప్రాంత ఆక్వా రైతులు

అమలాపురం టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది తీరప్రాంతం వెంబడి ఆక్వా చెరువుల తొలగింపు ప్రక్రియను నిలుపుదల చేయాలని కోరుతూ వందలాది మంది రైతులు శుక్రవారం కలెక్టరేట్‌కు చేరుకున్నారు. అంతర్వేది పల్లిపాలెం, అంతర్వేది దేవస్థానం, అంతర్వేది, కేశవదాసుపాలెం గ్రామాల్లో తీరప్రాంతం వెంబడి ఉన్న ఆక్వా చెరువులను ఎన్జీటీ తీర్పును అనుసరించి తొలగిస్తే తమ బతుకులు రోడ్డున పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. వందలాది ఎకరాల జిరాయితీ భూములు సముద్ర గర్భంలో కలిసిపోయ్యాయన్నారు. సర్పంచ్ పోతురాజు కిశోర్ ఆధ్వర్యంలో ఆక్వారైతులు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌ను ప్రతినిధుల బృందం స్వయంగా కలిసి గోడును వివరించారు. అనంతరం సర్పంచ్ కిశోర్ మాట్లాడుతూ ఆక్వా రైతుల సమస్యలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారన్నారు. నిరసనలో నాయకులు బైరా నాగరాజు, అడపా రాంబాబు, దొండపాటి రవికుమార్, ఆకన బాబ్జినాయుడు, మందపాటి వెంకటేశ్వరరావు, మందపాటి సరిత, మామిడిపల్లి సరిత, మందపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

### నీరు నిల్వ ఉంచకండి
అంబాజీపేట, మార్చి21(ఆంధ్రజ్యోతి): నివాస ప్రాంతాల మధ్య నీరు నిల్వ లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి ఎన్.వెంకటేశ్వరరావు సూచించారు. ముక్కామల పీహెచ్‌సీని శుక్రవారం ఆయన పరిశీలించారు. పీహెచ్‌సీలో ల్యాబ్‌ను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఎల్‌టీ ఎం.పల్లంశెట్టికి పలు సూచనలు చేశారు.

### రేపు ప్రపంచ కవితా దినోత్సవం
యానాం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): కవిసంధ్య యానాం-హైదరాబాద్ చిన్ని నారాయణరావు సాహితీ ఫౌండేషన్ నెల్లూరు సంయుక్త నిర్వహణలో ప్రపంచ కవితా దినోత్సవం సభను నిర్వహించనున్నట్టు కవిసంధ్య అధ్యక్షుడు శిఖామణి తెలిపారు. మార్చి 23న ఆదివారం హైదరాబాద్ పొట్టిశ్రీరాములు తెలుగువిశ్వవిద్యాలయంలోని కమిటీ హాలులో సభ జరగనుంది. సాయంత్రం 5 నుంచి 6గంటల వరకు సుధామ అధ్యక్షతన కవి సమ్మేళనం, అనంతరం శిఖామణి అధ్యక్షతన జరిగే సభలో దర్భశయనం శ్రీనివాసాచార్య కవిత్వం - ప్రయోజన అంశంపై ప్రత్యేక ప్రసంగం ఉంటుందన్నారు. కవితల పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. ముఖ్యఅతిథిగా ఆచార్య ఎన్.గోపి, గౌరవ అతిథులుగా ఓల్గా, డి.విజయ్‌భాస్కర్, మామిడి హరికృష్ణ, ఏనుగు నరసిహారెడ్డి, కొప్పర్తి ప్రసదామూర్తి, యాకూబ్, కోడూరి విజయ్‌కుమార్, కోయ కోటేశ్వరరావు, చిన్ని నారాయణరావు పాల్గొంటారన్నారు.

### సెల్‌ఫోన్లు అప్పగింత
అంబాజీపేట, మార్చి 21(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట సర్కిల్ కార్యాలయంలో పి.గన్నవరం సీఐ రుద్రరాజు భీమరాజు శుక్రవారం బాధితులకు సెల్‌ఫోన్లు అందించారు. ఈసందర్భంగా జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు ఆదేశాల మేరకు కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ పర్యవేక్షణలో సీఐ భీమరాజు మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో ఎవరైనా సెల్‌ఫోన్ పోగట్టుకుంటే సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫోన్ ట్రాకింగ్ ద్వారా సెల్‌ఫోన్లు రికవరీ చేస్తామన్నారు. ఈసందర్భంగా బాధితులు సీఐ భీమరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. అంబాజీపేట ఎస్ఐ కె.చిరంజీవి, సిబ్బంది పాల్గొన్నారు.

### క్షయ రహిత సమాజానికి అందరూ పాటుపడాలి
మామిడికుదురు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధి రహిత సమాజానికి అందరూ పాటుపడాలని నగరం పీహెచ్‌సీ సిబ్బంది సూచించారు. ప్రధానమంత్రి టీబీ ముక్తభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మొగలికుదురుహైస్కూలులో నగరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో విద్యార్థులకు క్షయ పట్ల అవగాహన కల్పించారు. క్షయవ్యాధి లక్షణాలు, తీసుకోవాల్సిన చికిత్స, వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం అందించే సేవలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్ సత్యనారాయణ, ఏడుకొండలు, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్న ప్రతీ కుటుంబాన్ని ఆదుకుంటాం

లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, కూటమి నాయకులు

పి.గన్నవరం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న ప్రతి కుటుంబాన్ని కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పి.గన్నవరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను అందించి అనంతరం మాట్లాడారు. సీఎం సహాయనిధి ద్వారా ఇప్పటి వరకు నియోజకవర్గంలో 170మందికి రూ.1.33 కోట్లు అందించిన ఘనత తమకే దక్కుతుందన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న ప్రతీ వ్యక్తికి సీఎం సహాయనిధి నుంచి సాయం అందేలా చర్యలు తీసుకుంటు న్నామన్నారు. శుక్రవారం రూ.39,62,462 విలువైన చెక్కులను 61మంది లబ్ధిదారులకు అందించామన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, సంసాని పెద్దిరాజు, శిరిగినీడి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కుమార్, దాసరి వీరవెంకట సత్యనారాయణ, మద్దా చంటి బాబు, జాలెం శ్రీనివాసరాజా, సాధనాల శ్రీవెంక టసత్యనారాయణ, దొమ్మేటి సాయికృష్ణ, ఆది మూలం సూరయ్యకాపు, కె.సత్యనారాయణ రాజు, అడబాల తాతకాపు, పప్పుల శ్రీనివాస్, యడ్ల ఏసు, అడ్డగళ్ల సిరిజ్యోతి, పెనుమాల లక్ష్మి, యల్లమిల్లి చిట్టిబాబు, యర్రంశెట్టి తాత పాల్గొన్నారు.

### పదో తరగతి పరీక్షలు ప్రశాంతం
ముమ్మిడివరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో శుక్రవారం పది పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఇంగ్లీషు పరీక్షకు సంబంధించి జిల్లాలో 110 పరీక్షా కేంద్రాల్లో 18,999మంది విద్యార్థులు పరీక్షల రాయాల్సి ఉండగా 18,903మంది పరీక్షకు హాజరయ్యారు. 96మంది గైర్హాజరైనట్టు డీఈవో డాక్టర్ షేక్ సలీంబాషా తెలిపారు. అంటే 99.49శాతం హాజరైనట్టు ఆయన తెలిపారు. వీరిలో బాలురు 9,438మందికి 9,382మంది హాజరుకాగా, 56 మంది గైర్హాజరయ్యారు. అలాగే బాలికలు 9,561మందికి 9521మంది పరీక్షకు హాజరుకాగా 40మంది గైర్హాజరయ్యారు. ఎక్కడా మాస్ కాపీయింగ్, మాల్‌ప్రాక్టీసు జరిగిన దాఖలాలు లేవని డీఈవో తెలిపారు. జిల్లాలో ఏడు పరీక్షా కేంద్రాలను జిల్లా పరిశీలనాధికారి ముమ్వా రామలింగం తనిఖీ నిర్వహించగా డీఈవో షేక్ సలీంబాషా మూడు పరీక్షా కేంద్రాలు, డీవైఈవో జి.సూర్యప్రకాశం 4 పరీక్షా కేంద్రాలు, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ బి.హనుమంతరావు ఒక పరీక్షా కేంద్రాన్ని, ఫ్లయింగ్ స్క్వాడ్ నాలుగు పరీక్షా కేంద్రాలను తనిఖీ నిర్వహించారు.

### భూసారాన్ని రక్షించుకుందాం
ఉప్పలగుప్తం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): క్రమంగా క్షీణిస్తున్న భూసార పరిరక్షణకు ప్రకృతి వ్యవసాయం దోహదపడుతుందని మండల వ్యవసాయాధికారి జి.కుమార్‌బాబు అన్నారు. శుక్రవారం స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రకృతి వ్యవసాయ శాఖ, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంతో ప్రయోజనాలు, ప్రభుత్వ లక్ష్యాలపై అవగాహన కల్పించారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి, జీవన ఎరువులు వాడకం ద్వారా భూసారం పెంచుకోవచ్చని ఆయన వివరించారు. మహిళా సంఘాల ద్వారా ప్రకృతి వ్యవసాయ సాగుకు ఏర్పాట్లు చేస్తున్నామని డీఆర్‌డీఏ ఏపీఎం ఎ.సురేంద్రబాబు అన్నారు. ఇప్పటికే తన పొలంలో ప్రకృతి సాగు ద్వారా వరి పండిస్తున్నట్టు నీటి పంపిణీ సంఘం మాజీ చైర్మన్ అరిగెల నానాజీ తన అనుభవాలను వివరించారు. సమావేశంలో ఎన్ఎఫ్ఏ హేమలత, యూనిట్ ఇన్‌చార్జి మల్లిఖార్జునరావు, సొసైటీ చైర్మన్ మంచెం బాలకృష్ణ, పాటి రామకృష్ణ, గుత్తుల నాగరాజు పాల్గొన్నారు.

## విజ్ఞాన సముపార్జనకు విద్యార్థుల విహారయాత్ర

కలెక్టరేట్ వద్ద విజ్ఞానవిహార యాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న డీఆర్వో రాజకుమారి

అమలాపురం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో మూడు రోజుల విద్యా విజ్ఞాన అధ్యయనం విహార యాత్ర బస్సులను శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి బీఎల్ఎన్ రాజకుమారి జెండా ఊపి ప్రారంభించారు. విజ్ఞాన సముపార్జనకు విద్యార్థుల విహార యాత్ర చేపట్టడం అభినందనీయమన్నారు. ఈనెల23వరకు 131మంది విద్యార్థులు, 20మంది ఉపాధ్యాయులతో విజ్ఞాన విహార యాత్ర నిర్వహిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి షేక్ సలీంబాషా తెలిపారు. విహార యాత్రలో భాగంగా తిరుపతి రీజనల్ సైన్స్ సెంటర్‌తో పాటు చంద్రగిరికోట వంటి ప్రాంతాలను విద్యార్థులు సందర్శిస్తారన్నారు. కార్యక్రమంలో ఉప విద్యాశాఖాధికారులు గుబ్బల సూర్యప్రకాశం, సుబ్రహ్మణ్యం, జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ ఎంఏకే భీమారావు, బొరుసు వీరవెంకటసుబ్రహ్మణ్యం, బీర హనుమంతరావు పాల్గొన్నారు.

## మూడోసారి కాంస్య పతకం సాధించిన గౌతమ్


గౌతమ్‌ను అభినందిస్తున్న ఎస్పీ

అమలాపురం టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఈనెల7 నుంచి 11వరకు హర్యానాలోని మడగడలో జరిగిన 73వ ఆలిండియా పోలీసు క్రీడా పోటీల్లో జిల్లాకు చెందిన పోలీసు కానిస్టేబుల్ యాండ్ర గౌతమ్ కాంస్య పతకం సాధించడం అభినందనీయమని ఎస్పీ బి.కృష్ణారావు పేర్కొన్నారు. 2018 బ్యాచ్‌కు చెందిన గౌతమ్ సపక్‌తక్రా క్రీడా పోటీల్లో జాతీయ స్థాయిలో 2023 జలంధర్‌లోను, 2024 నాగ్‌పూర్‌లోను, ఈఏడాది మడగడలోను వరుసగా కాంస్య పతకాలు సాధించడం పట్ల గౌతమ్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

### ఆర్టీసీ డ్రైవర్లపై వేధింపులు మానుకోవాలి
అమలాపురం రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): అమలాపురం ఆర్టీసీ డిపోలో డ్రైవర్లపై వేధింపులు మానుకోవాలని డిమాండ్‌చేస్తూ యునైటెడ్ వర్కర్స్ యూనియన్, నేషనల్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో 31వ రోజు శుక్రవారం గేట్ మీటింగ్ నిర్వహించారు. వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపకార్యదర్శి కె.రంగప్రసాద్ మాట్లాడుతూ అమలాపురం డిపోలో 1/2019 సర్క్యులర్‌ను అమలు చేయాలని, అక్రమంగా సస్పెండ్ చేసిన డ్రైవర్ బీఎస్ నారాయణను విధుల్లోకి తీసుకోవాలని, డ్రైవర్ కేజీ రావును డ్రైవర్ కం కండక్టర్ డ్యూటీకి వెళ్లాలని వేధించడం మానుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్ఎంయూ డిపో అధ్యక్షుడు హౌలియా మాట్లాడుతూ యాజమాన్య బలవంతంగా టిం డ్యూటీలకు పంపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. కార్మికులను వేధించడం వల్ల సంస్థ ప్రతిష్ఠ దెబ్బతింటుందన్నారు. ఇవే సమస్యలపై 26రోజులుగా ఎన్ఎంయూ ఆధ్వర్యంలో రిలే దీక్షలు చేస్తున్నా యాజమాన్యంలో మార్పు రాకపోవడం శోచనీయమని వివిధ సంఘాల నాయకులు ధ్వజమెత్తారు.

### డాక్టర్ దీపక్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ట్రోఫీ
అమలాపురం టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పాండిచ్చేరిలో శుక్రవారం జరిగిన జాతీయస్థాయి డాక్టర్స్ క్రికెట్ లీగ్ ఫైనల్ మ్యాచ్ పోటీల్లో అమలాపురం పట్టణానికి చెందిన వైద్య నిపుణుడు డాక్టర్ దీపక్‌చక్రవర్తి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కించుకున్నారు. డాక్టర్ కిరణ్ నేతృత్వంలోని పదకొండు మంది వైద్యుల బృందం పాండిచ్చేరిలో జరిగిన నేషనల్ డాక్టర్స్ క్రికెట్ లీగ్ సీజన్-4లో పాల్గొన్నారు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన డాక్టర్ దీపక్ చక్రవర్తిని డాక్టర్ కె.ప్రభాకరరావుతో పాటు వైద్యుల బృందం ప్రత్యేకంగా అభినందించారు.

### తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ
పి.గన్నవరం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న ఇంట్లో చోరి జరిగింది. ఉడిమూడి శివారు చింతావారిపేటకు చెందిన రావి కుమారి ఈనెల18న హోటల్‌లో పని నిమిత్తం ఇంటికి తాళం వేసి రెండు రోజులు రావులపాలెం వెళ్లింది. విజయవాడలో ఇంటర్మీడియట్ చదువుతున్న కుమారుడు శ్రీకాంత్ ఈనెల 20న ఇంటికి వచ్చాడు. ఇంటికి ఉన్న తాళం పగలుగొట్టి ఉండటంతో చోరీ జరిగినట్టు గుర్తించాడు. ఆరు కాసులు బంగారు ఆభరణాలు చోరికి గురైనట్టు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ బి.శివకృష్ణ తెలిపారు.

### ఉగాది పురస్కారాలకు నరసింహారావు దంపతుల ఎంపిక


పి.గన్నవరం, మార్చి21(ఆంధ్ర జ్యోతి): పలు సంస్థలు ఉగాది పుర స్కారాలను ప్రకటించాయి. ఉగాది పురస్కారాలకు రాష్ట్ర ప్రత్యేక రక్షణ దళం రాజమహేంద్రవరం జోన్ కమాండెంట్ డాక్టర్ కొండా నరసింహారావు, అలివేలు మంగాదేవి దంపతులు ఎంపికయ్యారు. 20 నిమిషాలు నిర్విరామంగా ఓంకార ప్రణవ నాదాన్ని ధ్వనిస్తూ శంఖాన్ని పూరించడంతో అనేక రికార్డులను సొంతం చేసుకుని యువగళంగా పేరొందిన శంఖారావ దంపతులకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ఐకాన్ అవార్డు, విశ్వగురు వరల్డ్ రికార్డ్ అవార్డులను ఆయా సంస్థలు ప్రకటించాయి. ఆయా సంస్థల ప్రతినిధుల నుంచి సమాచారం అందినట్టు నరసింహారావు తెలిపారు. ఈనెల23న హైదరాబాద్‌లో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ఐకాన్ అవార్డును, 29నకాకినాడలో వరల్డ్ రికార్డ్ అవార్డును అందుకుంటారు.

### ఓఎన్జీసీ దీక్షలకు జనసేన మద్దతు
అల్లవరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఓడలరేవు గ్రామ దత్తత తీసు స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్న డిమాండ్లతో గ్రామస్తులు చేస్తున్న ఆందోళన 19వ రోజైన శుక్రవారం కొనసాగింది. జనసేన నాయకులు గుర్రం కృష్ణ, పిండి గణపయ్య, గునిశెట్టి చినబాబు, చాట్ల మంగతాయారు, రొక్కాల నాగేశ్వరరావు, కంకిపాటి గోపి, ఎంపీటీసీ తిక్కా శేషుబాబు, నల్లా రాము, సాధనాల సత్యనారాయణ, గోళ్ల కమలలు దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. కొల్లు విష్ణుమూర్తి, నాతి లెనిన్‌బాబు, కొప్పాడి వెంకటరామకృష్ణ, గ్రామస్తులు, మహిళలు రిలే దీక్షల్లో పాల్గొన్నారు.

### చెత్త నుంచి సంపద తయారీపై అవగాహన
అల్లవరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): అమలాపురం, అల్లవరం, మామిడికుదురు మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు క్లాప్ మిత్రలకు చెత్త నుంచి సంపద తయారీపై డివిజన్ పంచాయతీ అధికారి వి.బొజ్జిరాజు అవగాహన కల్పించారు. కొమరగిరిపట్నం షెడ్డు వద్ద సెమీ కంపోస్టు, వర్మీ కంపోస్టులపై అవగాహన కల్పించారు. అల్లవరం విస్తరణాధికారి యు.నాగేంద్ర, ఎఫ్‌టీసీ మధుమహేష్, స్థానిక సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి, మండల విస్తరణాధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

### దేవాన్ష్ పుట్టినరోజు..టీడీపీ నాయకుల అన్నదానం
రాజోలు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు మనుమడు, ఐటీ, విద్యా శాఖల మంత్రి లోకేష్ తనయుడు దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి, టీడీపీ పెద్దాపురం నియోజకవర్గ పరిశీలకుడు బోళ్ల వెంకటరమణ ఆధ్వర్యంలో రాజోలులో శుక్రవారం అన్నదానం నిర్వహించారు. రాజోలు వివేకానంద మనోవికాస కేంద్రంలో దివ్యాంగులకు అన్నదానం నిర్వహించారు. అన్నదానం చేసిన వెంకటరమణను నిర్వాహకురాలు మట్టపర్తిలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు.

### ముగ్గురిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు
పి.గన్నవరం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ముగ్గురుపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్టు ఎస్ఐ బి.శివ కృష్ణ తెలిపారు. గురువారం అర్ధరాత్రి నిర్వహించిన వాహనాల తనిఖీల్లో రెండు టిప్పర్ లారీల డ్రైవర్లు, ఒక ద్విచక్ర వాహన చోదకుడును మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్టు గుర్తించినట్టు ఆయన తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలిస్తున్నట్టు తెలిపారు.

### ఆంగ్ల పరీక్షకు ముగ్గురు గైర్హాజరు
అంబాజీపేట, మార్చి 21(ఆంధ్రజ్యోతి): అంబాజీపేట, తొండవరం, పుల్లేటికుర్రు హైస్కూల్స్‌లో శుక్రవారం నిర్వహించిన ఇంగ్లీషు పరీక్షకు 457మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 453మంది హాజరైనట్టు ఎంఈవోలు కె.వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ తెలిపారు. పరీక్షా కేంద్రాన్ని జిల్లా స్థాయి అబ్జర్వర్ ముమ్వా రామలింగం పరిశీలించారు. ఆయా పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆయా కేంద్రాల్లో అంబాజీపేట, ముక్కామల పీహెచ్‌సీల ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు.

### డీఆర్డీఏ పీడీ పూజలు
అయినవిల్లి, మార్చి 21(ఆంధ్రజ్యోతి):జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ నూతన ప్రాజెక్టు డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన టి.సాయినాథ్ జయచంద్ర శుక్రవారం అయినవిల్లి సిద్ధివినాయకుడిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ మర్యాదలతో స్వాగతం పలికిన అధికారులు ఆయనకు స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు. డీపీఎం హెచ్ఆర్ విజయ్‌కుమార్, ఏపీఎం వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

### ఇంటర్ జవాబు పత్రాల మూల్యాంకనం
అమలాపురం టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): అమలాపురం ప్రభుత్వ బాలిక జూనియర్ కళాశాలలో శుక్రవారం నుంచి ఇంటర్మీడియట్ అర్థశాస్త్రం, భౌతికశాస్త్రం జవాబుపత్రాల మూల్యాంకన ప్రారంభించినట్టు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వనుము సోమశేఖరరావు తెలిపారు. ఇప్పటికే తెలుగు, హిందీ, ఇంగ్లీషు, గణితం, పౌరశాస్త్రం, సంస్కృతం సబ్జెక్టుల జవాబుపత్రాల మూల్యాంకనం ఇదే కళాశాలలో కొన్నిరోజులుగా జరుగుతుందన్నారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఇంటర్మీడియట్‌కు సంబంధించి 22,163 భౌతికశాస్త్రం, 5651 అర్థశాస్త్రం జవాబు పత్రాల మూల్యాంకన ప్రారంభించామన్నారు. ఇంటర్మీడియట్ విద్యా మండలి నుంచి ఉత్తర్వులు అందుకున్న ఉపన్యాసకులు అందరూ స్పాట్ వాల్యుయేషన్ క్యాంపునకు హాజరు కావాలన్నారు. ఉత్తర్వులు అందుకున్న వారిని సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్స్ రిలీవ్‌చేసి మూల్యాంకన కేంద్రానికి పంపించాలని డీఐఈవో సోమశేఖరరావు కోరారు.

### రైతులకు సకాలంలో సేవలు
అమలాపురం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మార్క్‌ఫెడ్ ద్వారా, గ్రామాల్లో ఉన్న సొసైటీల ద్వారా రైతులకు సకాలంలో ఎరువుల పంపిణీ చేయాలని నిర్ణయం చేసినట్టు మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల నరసింహారావు (పెదకాపు) తెలిపారు. విజయవాడలో జరిగిన మార్క్‌ఫెడ్ 12వ సర్వసభ్య సమావేశంలో రైతులు పండించిన పంటలను ప్రభుత్వం నేరుగా కొనుగోలు చేయాలని, రైతులకు సేవలు అందించడానికి నిర్ణయాలు తీసుకున్నట్టు తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో ఉన్న సమస్యలపై సమావేశంలో చర్చించారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ కె.బంగార్రాజు అధ్యక్షతన ఈ సమావేశం జరిగినట్టు పెదకాపు తెలిపారు.

### మహిళను వేధించిన కేసులో ఒకరి అరెస్టు
అమలాపురం టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): అమలాపురంలోని ఒక కొరియర్‌లో పనిచేస్తోన్న మహిళను వేధిస్తున్న కేసులో అయినవిల్లి మండలం నేదునూరుకు చెందిన వాసంశెట్టి రామదుర్గాప్రసాద్‌ను శుక్రవారం అరెస్టుచేసి కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14రోజులు రిమాండ్ విధించారని పట్టణ ఎస్ఐ నరహరశెట్టి రామ్‌కిశోర్‌బాబు తెలిపారు. బోడసకుర్రుకు చెందిన మహిళ కొంత కాలంగా ఒక కొరియర్‌లో పనిచేస్తోంది. ఆమెను దుర్గాప్రసాద్ కొంతకాలంగా వెంటపడి వేధిస్తున్నాడు. ఈనెల18న తనను ప్రేమించకపోతే కత్తితో చంపుతానని బెదిరించి ఆమె ఫోన్‌ను బలవంతంగా లాక్కొని పరారయ్యాడు. బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదుచేసి ఉన్నతాధికారుల ఆదేశాలతో దుర్గాప్రసాద్‌ను అరెస్టు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. కోర్టు రిమాండ్ విధించడంతో దుర్గాప్రసాద్‌ను కొత్తపేట సబ్‌జైలుకు తరలించామన్నారు.

### గోపాల్‌నగర్‌లో చెత్త వేయడం ఆపండి
యానాం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): యానాం గోపాల్‌నగర్‌లోని విద్యుత్ శాఖ సబ్‌స్టేషన్‌లో చెత్తవేయడం ఆపాలని యానాం పరిపాలనాధికారి మునిస్వామిని స్థానికులు కోరారు. మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో పారిశుధ్య సిబ్బంది చెత్తను డంప్ చేస్తున్నారని, తక్షణం చెత్త డంప్ చేయడం నిలుపుదలచేయాలని కోరారు. మున్సిపాల్ కార్యాలయంలో ఉన్న ఆర్ఏ మునిస్వామిని స్థానికులు కలిసి పరిస్థితిని వివరించారు. 15 రోజులు అక్కడ చెత్త డంప్ చేయడానికి అనుమతులు ఉన్నాయని అధికారులు ప్రజలకు వివరించారు. గతంలో అనుమతులు కాదని ప్రస్తుతం తాజాగా వచ్చిన అనుమతులు ఉంటే చూపాలని ప్రజలు కోరారు. చెత్త అక్కడ డంప్ ఆపాలని లేకుంటే ఆందోళనకు సిద్ధమని ప్రజలు హెచ్చరించారు.

### 27న వైస్ ఎంపీపీ ఎన్నిక
పి.గన్నవరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఈనెల27న వైస్ ఎంపీపీ ఎన్నిక నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కేవీ ప్రసాద్ తెలిపారు. ఎన్నికల అధికారిగా కొత్తపేట డీఎల్‌డీవో ఎస్‌జేవీ రాజేశ్వరరావు వ్యవహరించనున్నట్టు ఆయన తెలిపారు. ఎంపీటీసీల ఎన్నికల సమయంలో టీడీపీ, జనసేన జెంటిల్‌మెన్ ఒప్పందాన్ని కుదుర్చుకుంది. రెండేళ్ల అనంతరం అప్పటి వరకు ఎంపీపీగా చేసిన టీడీపీకి చెందిన ఎంపీపీ అంబటి భూలక్ష్మి రాజీ నామ చేయగా జనసేన పార్టీకి చెందిన గనిశెట్టి నాగలక్ష్మి ఎంపీపీగా బాధ్య తలు చేపట్టారు. ఇద్దరు వైఎస్ ఎంపీపీలకు రెండేళ్ల క్రితం ఒకరు రాజీనామా చేయడంతో వైస్ ఎంపీపీగా టీడీపీకి చెందిన చెల్లుబోయిన గంగాదేవి బాధ్యతలు చేపట్టారు. ఇప్పుడు మరో వైస్ ఎంపీపీ పదవి ఖాళీగా ఉండ టంతో ఎన్నిక అనివార్యమైంది. ఈక్రమంలో ఎన్నికల సంఘం ఆదేశాలు మేరకు 27న ఎన్నిక నిర్వహించడానికి ఏర్పాట్లుచేసినట్టు ఎంపీడీవో తెలిపారు.

### స్వయం ఉపాధి పథకాల దరఖాస్తులకు నేడే ఆఖరు
పి.గన్నవరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): 2024-25 ఏడాదికి రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన తరగతులు వారికి, ఆర్థికంగా వెనుకబడిన వారికి సబ్సిడీతో రుణాలు అందిస్తుంది. శనివారంలోపు రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో కేవీ ప్రసాద్ తెలిపారు.

### తీర ప్రాంత రైతులను ఆదుకోవాలి
అమలాపురం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): కేశనపల్లి వెస్ట్ జీజీఎస్ నుంచి విషవాయువు లీకవ్వడం ద్వారా అస్వస్థతకు గురైన సంఘటనపై బీజేపీ నాయకులు శుక్రవారం జీజీఎస్ ప్లాంట్ ఇన్‌చార్జి నాయక్‌తో సమావేశమయ్యారు. సంఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని, బాధితులకు మెరుగైన వైద్య సాయం అందించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమా, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, జాతీయ కిసాన్‌మోర్చా కార్యవర్గ సభ్యుడు నల్లా పవన్‌కుమార్, నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు, అధికార ప్రతినిధి మాలే శ్రీనివాసనగేష్, మేడిచర్ల చాణుక్య, కె.కనకేశ్వరరావు తదితరులు ఓఎన్జీసీ అధికారులతో మాట్లాడారు.

### క్రేస్‌మేట్స్ బహూకరణ
అమలాపురం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గుడిమెళ్లంక జిల్లాపరిషత్ హైస్కూలుకు అల్లూరి గోపరాజు సతీమణి కృష్ణరాజే, వారి స్నేహితులు కలిసి రూ.70వేలు విలువైన మల్లకంబ క్రీడకు సంబంధించి క్రేస్‌మేట్స్, రోమన్ రింగ్‌లను శుక్రవారం బహూకరించారు. దాతలకు పాఠశాల సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

# మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

## ఆత్మరక్షణకు కరాటే దోహదం : ఎస్ఐ

రాయవరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ఆడబిడ్డల ఆత్మరక్షణకు కరాటే ఎంతో దోహదపడుతుందని ఎస్ఐ డీ.సురేష్ బాబు అన్నారు. శుక్రవారం స్థానిక భాష్యం స్కూల్‌లో సెల్ఫ్ డిఫెన్స్‌పై అవగాహన కల్పించారు. దీనికి హాజరైన ఎస్ఐ మాట్లాడుతూ కరాటే, మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ తీసుకోవడం ద్వారా నేటి సమాజంలో బాలికలు ఆపద సమయంలో తమను తాము రక్షించుకునేందుకు ధైర్యం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పట్నాల శ్రీనివాసగుప్తా, లిటిల్‌చాంప్స్ ప్రిన్సిపాల్ ఎం.కాంచన, మహిళా అధ్యాపకులు, విద్యార్థినులు, తదితరులు పాల్గొన్నారు.


రాయవరం భాష్యం స్కూల్‌లో ఉమెన్ ప్రొటెక్షన్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ, తదితరులు

## కే.గంగవరం ఏఈగా భాస్కరకుమార్ బాధ్యతలు


నూతన ఏఈని అభినందిస్తున్న విద్యుత్ సిబ్బంది

కె.గంగవరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కే.గంగవరం విద్యుత్‌శాఖ ఏఈగా టీ. భాస్కర్ కుమార్ నియమితులయ్యారు. ఈయన ప్రస్తుతం కే.గంగవరం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో జేఈగా పనిచేస్తూ, ఇన్‌చార్జి ఏఈగా అదనపు బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. జేఈ నుంచి ఏఈగా పదోన్నతి ఇచ్చి పూర్తిబాధ్యతలు అప్పగిస్తూ విద్యుత్‌శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, లైన్‌మేన్లు, షిఫ్ట్ ఆపరేటర్లు పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## చెల్లూరులో ఆక్రమణ స్థలం పరిశీలన

రాయవరం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): చెల్లూరు మహాత్మాగాంధీనగర్ దళితపేటలో వెంకటేశ్వరరావు అనే వ్యక్తి పంచాయతీ స్థలాన్ని ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపడుతున్నట్టు వచ్చిన ఫిర్యాదుపై శుక్రవారం ఆర్ఐ ధర్మేంద్ర, సర్వేయర్, వీఆర్వో వెళ్లి ఇంటి నిర్మాణాన్ని పరిశీలించారు. అనంతరం పనులు ఆపాలని నిర్మాణదారుడికి సూచించారు. దీనిపై తహశీల్దార్ ఐపీ శెట్టి మాట్లాడుతూ తమ పేటలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి వ్యక్తి ఇంటి నిర్మిస్తున్నట్టు అదే గ్రామానికి చెందిన దార్ల సుధీర్‌బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అధికారులు పరిశీలించారని, పంచాయతీలోని కొంత స్థలం ఆక్రమణకు గురైనట్టు ప్రాథమికంగా అంచనా వేశామన్నారు.


ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఆర్ఐ ధర్మేంద్ర, సర్వేయర్

## హోటల్ నిర్వాహకులు నిబంధనలు పాటించాలి


సమావేశంలో కమిషనర్ రంగారావు

మండపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలో గల హోటల్ నిర్వాహకులు ఖచ్చితంగా నాణ్యతతో పాటు నిబంధనలు పాటించాల్సిందేనని కమిషనర్ టీవీ రంగారావు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం హోటల్ నిర్వాహకులతో సమావేశాన్ని నిర్వహించారు. నిబంధనల మేరకు మంచి ఆహారాన్ని వినియోగదారులకు అందించాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.సత్తిరాజు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు

మండపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): తన భార్య కనిపించటం లేదంటూ ఓ భర్త మండపేట పట్టణ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశాడు. ఇన్‌చార్జి ఎస్ఐ జీ.చంటి తెలిపిన వివరాల ప్రకారం.. న్యూకాలనీకి చెందిన దండంగి రాజేష్ భార్య లక్ష్మి శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి కనిపించటం లేదని ఆమె భర్త రాజేష్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

## ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు

మండపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండపేట అర్బన్, రూరల్‌లో పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నట్టు ఎంఈవో నాయుడు రామచంద్రరావు తెలిపారు. శుక్రవారం జరిగిన ఆంగ్లపరీక్షకు సంబంధించి మొత్తం 1814 మంది విద్యార్థులకు గాను 1810 మంది హాజరవ్వగా, నలుగురు విద్యార్థులు గైర్హాజరయ్యారు.

# ప్రజలకు కవిత్వం అండగా ఉండాలి

● ప్రముఖ కవి, విమర్శకుడు డాక్టర్ చల్లా రవి కుమార్

మండపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కవిత్వం అంటే సమాజంలోని ప్రజలకు అండగా ఉండాలని ప్రముఖ కవి, విమర్శకుడు, డాక్టర్ చల్లా రవికుమార్ అభిప్రాయపడ్డారు. మండపేట పట్టణంలో శుక్రవారం ప్రపంచ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండపేట - ఆలమూరు రోడ్డులోని అన్నపూర్ణ హైస్కూల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అభ్యుదయ రచయితల సంఘం, మండపేట సంఘం సాంస్కృతి వేదిక ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి హాజరైన సాహితీ గోదావరి అధ్యక్షుడు డాక్టర్ ర్యాలీశ్రీని వాస్, అరసం జిల్లా అధ్యక్షుడు గండిస్వామి ప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమానికి హాజరైన కవులను సత్కరించి, విజేతలకు బహుమతులను అందజేశారు. న్యాయ నిర్ణేతగా కవి, సామాజిక వేత్త డాక్టర్ ర్యాలీ శ్రీనివాస్ వ్యవహరించారు. కార్యక్రమంలో అన్నపూర్ణ విద్యాసంస్థల అధినేత వల్లూరి సత్యనారాయణ చౌదరి, కళామిత్ర మీరా సాహెబ్, కవులు గోడవర్తి శ్రీనివాస్, ఆర్.వీ.వీరాజా, శ్రీనివాసాచార్యులు, అవసరాల మాధవరావు, వినకోటి రాజేష్‌కుమార్, కల్లూరిజాజు, తదితరులు పాలల్గొన్నారు.



మండపేటలో మాట్లాడుతున్న డాక్టర్ చల్లా రవికుమార్

# 'ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం'


సమావేశంలో మాట్లాడుతున్న ఏవో రమేష్‌కుమార్

కపిలేశ్వరపురం, మార్చి 21(ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు వినియోగించడం వల్ల మంచి ఆరోగ్యం చేకూరుతుందని మండల వ్యవసాధికారి కేవీఎన్ కుమార్ అన్నారు. శుక్రవారం కపిలేశ్వరపురంలోని మండల మహిళా సమైఖ్య కార్యాలయంలో నిర్వహించిన కన్వర్జెన్సీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర కమ్యూనిటీలో ప్రకృతి వ్యవసాయం (ఏపీసీఎన్ఎఫ్) (డీఆర్ డీప) అగ్రికల్చర్, హర్టికల్చర్ డిపార్ట్‌మెంట్లతో కలిసి ప్రభుత్వ ఆదేశాల మేరకు పై మూడు సంస్థలతో పనిచేయాలన్నారు. ప్రకృతి వ్యవసాయంలో రైతులందరితో పీఎండీఎస్ (ప్రీ మాన్స్యూన్ డ్రై సోయింగ్) 36 రకాల విత్తనాలతో ప్రకృతి వ్యవసాయం చేయించాలని, దీనిపై మూడు సంస్థలు సహకారం అందిస్తాయని తెలిపారు. ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ ఏటీఎం మోడల్, ఏ గ్రేడ్ మోడల్ (ఎంటీ) స్వర్ణలత, (ఎస్ఎఫ్ఏ) అనంత కుమార్ సభ్యులకు వివరించారు. కార్యక్రమంలో ఏపీసీఎన్ఎఫ్ బృందం, డీఆర్‌డీఏ స్టాఫ్, ఏపీఎం స్వర్ణకుమారి, వివిధ గ్రామాల గ్రామవ్యవసాయ, ఉద్యాన సహాయకులు, ఏపీసీఎన్ఎఫ్ యూనిట్ ఇన్‌చార్జీలు ఎం. శ్రీను, డీవీ సత్యనారాయణ, టి. దిలీప్, కె. సూర్యప్రకాశరావు, పి. విజయ, గ్రామవీవో, డ్వాక్రా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మండపేట, మార్చి21 (ఆంధ్రజ్యోతి): తాపేశ్వరం,ఏడిద విద్యుత్‌సబ్‌స్టేషన్ల పరిధిలో శని, ఆదివారాలు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని రామచంద్రపురం విద్యుత్‌శాఖ డీఈ కే.రత్నాలరావు తెలిపారు. ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఉండదన్నారు. 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల నిమిత్తం నిలుపుదల చేస్తున్నామన్నారు. అర్తమూరు, తాపేశ్వరం ఇప్పనపాడు, మెర్నిపాడు, తదితర గ్రామాల సహకరించాలని ఆయన కోరారు.

## అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ


వెలుగు కార్యాలయంలో శిక్షణ ఇస్తున్న దృశ్యం

కె.గంగవరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పోషణ్ బీ పడాయ్ బీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. రామచంద్రపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి వరాహలక్ష్మి ఆధ్వ ర్యంలో జరిగింది. ఇందులో పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు చంద్రకళ, పార్వతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం


స్వామివారిని అలంకరించిన దృశ్యం

కె.గంగవరం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పాతకోటలో ఆంజనేయస్వామి ఆలయ నాలుగో వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి విగ్రహాన్ని పూలమాలలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. దీనిలో భాగంగా దొమ్మేటి లోవబాబు, శ్రీనుబాబు ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన జరిగింది. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## న్యాయమూర్తికి కృతజ్ఞతలు

మండపేట, మార్చి21 (ఆంధ్రజ్యోతి): మండపేట పట్టణ పోలీసుస్టేషన్‌లో 2021లో పైడిముక్కల రాణి అన్నపూర్ణ తన అత్తమామలపై వరకట్న వేధింపుల కేసు పెట్టింది. దీంతో ఇదే కేసులో గత నాలుగేళ్ల నుంచి ఆలమూరు న్యాయస్థానానికి వాయిదాల కోసం కోడలు, అత్తమామలు తిరుగుతున్నారు. ఇందులో నానమ్మ అనే ముద్దాయికి తన మనుమలు ఇద్దరినీ కోడలు చూపించడం లేదని, తనకు చూడాలని ఉందని ఈనెల 8న లోక్‌అదాలత్‌లో న్యాయమూర్తి వద్ద ప్రాధేయపడటంతో జడ్జి వి. నాగేశ్వరనాయక్ మాట్లాడి శుక్రవారం వారిని చూసేందుకు అవకాశం కల్పించారు. దీంతో సదరు కోడలు తన ఇద్దరు పిల్లలను తీసుకుని ఆలమూరు న్యాయస్థానానికి రావడంతో నానమ్మ జానకిదేవి సంతోషం వ్యక్తం చేశారు. ఈ అవకాశం కల్పించిన జడ్జికి ఆమె కృతజ్ఞతలు తెలిపింది.

## ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో సంబరాలు


మండపేటలో సంబరాలు జరుపుకుంటున్న దృశ్యం

మండపేట, మార్చి21 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ కోసం 30 ఏళ్ల పాటు సుదీర్ఘపోరాటం చేసిన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు మందకృష్ణమాదిగ చరిత్రలో నిలిపోతాడని ఎంఆర్‌పీఎస్ నాయకులు అన్నారు. మండపేట పట్టణంలోని స్థానిక ఎస్సీ కాలనీలో శుక్రవారం ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు దుళి జయరాజు, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మందపల్లి చంద్రశేఖర్ నేతృత్వంలో విజయోత్సవ వేడుకలను నిర్వహించారు. దీనికి డాక్టర్ దూలపల్లి సుబ్బారావు, డాక్టర్ గాలింకి జాన్ మోసే, విశ్రాంత డి.వై.ఇవో పెనుమాక షాలెం రాజు, తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాలనీలో వున్న అంబేడ్కర్, జగ్జీవన్ రామ్ విగ్రహాలకు తొలుత నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. కార్యక్రమంలో బీసీ సంఘ నేత కోన సత్యనారాయణ, కుక్కల రామారావు, గాలింకి నాగేశ్వరరావు, కిషోర్, చిట్టిబాబు, వేమగిరి మోషే, ప్రవీణ్, ఎంఆర్‌పీఎస్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి పరీక్షలు ప్రశాంతం

**విద్యాశాఖ జేడీ రామలింగం**



కొత్తపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదవ తరగతి పరీక్షలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా జరుగుతున్నాయని రాష్ట్ర విద్యాశాఖ జేడీ, కోనసీమ జిల్లా అబ్జర్వర్ ముప్పా రామలింగం తెలిపారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో జరిగే పరీక్షా కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి 10వ తరగతి పరీక్షలు మొదలుకాగా ఇప్పటి వరకూ తెలుగు, హిందీ, ఇంగ్లీష్ పరీక్షలు పూర్తయ్యాయన్నారు. జిల్లా కలెక్టర్, ఎస్పీ, విద్యా, వైద్య శాఖ ఆధ్వర్యంలో అన్ని వసతులు సమకూర్చినట్టు చెప్పారు. విద్యార్థులు ర్యాంకులు, మార్కులు పట్ల తల్లిదండ్రులు ఆందోళన చెంది, వారిని మానసిక ఒత్తిడికి గురిచేయొద్దన్నారు. విద్యార్థులు ఇష్టానికి అనుగుణంగా తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.

## నేడు క్యాన్సర్ రోగులకు మెరుగైన వైద్యసేవల నమోదు శిబిరం

రామచంద్రపురం(ద్రాక్షారామ),మార్చి21(ఆంధ్రజ్యోతి):క్యాన్సర్ రోగులకు గుంటూరు ఆసుపత్రి ద్వారా మెరుగైన వైద్యసేవలు అందించేందుకు శనివారం వివరాలు నమోదుకు శిబిరం నిర్వహిస్తున్నట్టు మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. రోగులకు మెరుగైన వైద్యసేవలతో పాటు మందులు అందజేసేందుకు వైద్యుల సమక్షంలో రోగుల వివరాలు నమోదు చేస్తామన్నారు. సాయంత్రం 4 గంటలకు మంత్రి క్యాంపు కార్యాలయం వద్దకు రోగులు హాజరు కావాలని కోరారు. హాజరు కాలేని వారు గత రిపోర్టులతో బంధువులు లేదా సహాయకులను పంపి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

## వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.2.79 లక్షలు


ఆలయంలో అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఆత్రేయపురం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. నోము ఆచరించిన వారు అష్టోత్తర పూజలు, నిత్యకళ్యాణాలు నిర్వహించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,79,538 లభించినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. అలాగే సినినటుడు మధునందన్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నూతనంగా ఏర్పాటు చేస్తున్న లైన్లు, దీపారధన మండపం, మరుగుదొడ్ల నిర్మాణాలతో వివిధ అభివృద్ధి పనులను ఈవో పరిశీలించిన పలు సూచనలు చేశారు. శనివారం తరలివచ్చే భక్తులకు ఏర్పాట్లు చేపడుతున్నారు.

## కోర్టు ప్రాంగణంలో నీటి శుద్ధి యంత్రం


నీటి శుద్ధి యంత్రాన్ని ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి శంకరరావు

రామచంద్రపురం(ద్రాక్షారామ),మార్చి21(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం పట్టణంలో సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన నీటి శుద్ధి యంత్రాన్ని 13వ అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి శంకరరావు శుక్రవారం ప్రారంభించారు. బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజరు అరుణ సౌజన్యంతో ఈ యంత్రాన్ని ఏర్పాటు చేశారు. కక్షిదారుల దాహార్తిని తీర్చేందుకు ఉపయోగపడుతుందని జిల్లా జడ్జి అన్నారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేశ్వరరావు, జూనియర్ సివిల్ జడ్జి నిజాం శారద, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వీఎంఎంవీ రమణ, కార్యదర్శి వాడ్రేవు సాయిప్రసాద్, కార్యవర్గ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## 'ఆదరణ-3'పై అవగాహన

కొత్తపేట, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలో 10 గ్రామాల వెనుకబడిన కులవృత్తుల వారికి ఆదరణ -3పథకంపై శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. వారికి అవసరమైన పనిముట్ల వివరాలను తెలుసుకుని వాటి సరఫరా కొరకు సంబంధిత బీసీ కార్పొరేషన్‌కు తెలియపరచనున్నట్టు ఎంపీడీవో తెలిపారు. ఈ మేరకు వారికి కావాల్సిన పనిముట్లపై వృత్తుల వారీగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈవోపీర్డీ సుబ్బారావు, ఏవో ఎం.రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## పేరవరం పంట కాలువలో గుర్రపుడెక్క తొలగింపు



ఆత్రేయపురం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరవరం నీటి సంఘం ఆయకట్టు పరిధిలో వరి, ఉద్యానవన పంటలకు సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. నీటి సంఘం అధ్యక్షుడు జుజ్జవరపు వెంకట శ్రీహరి, రాష్ట్ర టీఎన్‌టీయూసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ముళ్లపూడి భాస్కరరావు ఆధ్వర్యంలో శుక్రవారం పంట కాలువల్లో గుర్రపుడెక్క, తూడును జేసీబీ సాయంతో తొలగించే కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రస్తుతం వరిచేలు ఈనిక దశలో ఉన్నందున సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా వంతుల వారీ విధానంలో కాలువలు శుభ్రం చేస్తున్నట్టు తెలిపారు.

## ఆదమరిస్తే అంతే..!

**పొంచి ఉన్న ప్రమాదం**

- శిథిల స్థితిలో వంతెనలు, కల్వర్టులు
- రెయిలింగ్ లేకపోవడంతో తరచూ ప్రమాదాలు
- భయాందోళనలో ప్రయాణికులు

ఆత్రేయపురం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): బ్రిటీష్ హయాంలో నిర్మించిన వంతెనలు కల్వర్టులు శిథిలస్థితికి చేరుకున్నాయి. నిత్యం ఈ వంతెనలపై ప్రయాణాలు సాగిస్తుంటారు. రైతులు పండించిన ఉత్పత్తులు శిథిల వంతెనలు, కల్వర్టులపై వెళ్లాల్సి ఉంది. మండలంలో మేజర్ గ్రామమైన ర్యాలీ వంతెన శిథిలస్థితికి చేరుకుంది. మూడు గ్రామాల ప్రజలు వంతెనపై రాకపోకలు సాగిస్తుంటారు. ప్రసిద్ధి పుణ్యక్షేత్రం జగన్మోహిని కేశవస్వామి ఆలయానికి నిత్యం భక్తులు వస్తుంటారు. ఇసుక, ఇటుక లారీలు, ట్రాక్టర్లు ఈ వంతెనపై రాకపోకలు సాగిస్తున్నారు. రెయిలింగ్ విరిగిపోయి ఎప్పుడు ఒరిగిపోతుందో తెలియని పరిస్థితి. అలాగే లొల్ల నుంచి ర్యాలీ సడక్ రోడ్డుకు వెళ్లే కల్వర్టు ఇరువైపులా రెయిలింగ్ లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రైతులు పంటలు ఈ కల్వర్టు మీదుగానే రవాణా సాగిస్తున్నారు. ప్రమాదాలకు నిలయంగా మారిన శిథిల కల్వర్టులు, వంతెనలకు మోక్షం కల్పించాలని కోరుతున్నారు.


రెయిలింగ్ లేని లొల్ల కల్వర్టు


అధ్వానంగా ర్యాలీ వంతెన

## 'ఉల్లాస్' శిక్షణార్థులకు రేపు పరీక్షలు


ఉల్లాస్ పరీక్ష మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న అధికారులు

ఆలమూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఉల్లాస్ వయోజన విద్యలో శిక్షణ పొందిన వారికి ఈనెల 23న శిక్షణా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నట్టు ఉల్లాస్ వయోజన విద్య జిల్లా కోఆర్డినేటర్ విజయభాస్కర్, ఎంపీడీవో ఎ.రాజు తెలిపారు. ఈ నేపథ్యంలో ఐసీడీఎస్, విద్యాశాఖ, డీఆర్‌డీఏ ఉద్యోగులతో శుక్రవారం సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి ఉల్లాస్ పరీక్షల నిర్వహణపై కోఆర్డినేటర్, ఎంపీడీవోతోపాటు డీఆర్‌డీఏ ఏపీఎం ధనరాజు, ఎంఈవో బి.అప్పాజీ శిక్షణ ఇచ్చారు. మండలంలోని 18 గ్రామాల్లో 28 సెంటర్లలో శిక్షణ నిర్వహించి 792 మందికి వయోజన విద్యను అందించారు. పరీక్షల నిర్వాహకులుగా అంగన్‌వాడీ టీచర్లను ఎంపిక చేసి వారికి పరీక్షలకు సంబంధించిన మెటీరీల్స్‌ను అందజేశారు. పరీక్షలు సక్రమంగా నిర్వహించాలని వారు సూచించారు.

## గోగులమ్మ పాదాలను తాకిన సూర్యకిరణాలు



ద్రాక్షారామ, మార్చి 21(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం ఓదూరు గ్రామంలోని గోగులమ్మ అమ్మవారి ఆలయంలో శుక్రవారం ఉదయం అమ్మవారి పాదాలను సూర్యకిరణాలు తాకాయి. ఇటీవల అమ్మవారి ఆలయం పునః నిర్మాణం చేసి నూతన విగ్రహ ప్రతిష్ఠ జరిపారు. శుక్రవారం సూర్యకిరణాలు అమ్మవారి పాదపద్మాలను తాకడం శుభ సూచకంగా భక్తులు భావించారు. అమ్మవారిని దర్శించుకున్నారు.

## వృద్ధుడి మోకాలిపై కణితి తొలగింపు



రామచంద్రపురం(ద్రాక్షారామ), మార్చి 21(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి వైద్యులు శుక్రవారం 70 ఏళ్ల వృద్ధుడి మోకాలికి శస్త్రచికిత్స చేసి జాయింటు వద్ద ఉన్న కణితి తొలగించారు. ఆలమూరు మండలం మడికి పంచాయతీ మల్లవానితోటకు చెందిన చెల్లుబోయిన సత్యనారాయణ కుడిమోకాలి జాయింటు పక్క ఉన్న 200 గ్రాముల కణితిని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ కల్యాణ్‌బాబు శస్త్రచికిత్స చేసి తొలగించారు. సత్యనారాయణ ఆరోగ్యం నిలకడగా ఉన్నట్టు తెలిపారు.

## కోకో సాగు పెంపునకు ప్రణాళికలు

**ఉద్యాన శాఖ కొత్తపేట నియోజకవర్గ అధికారి కోటేశ్వరరావు**



ఆత్రేయపురం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లాలో కోకో సాగు విస్తీర్ణం పెంచే విధంగా ఉద్యాన శాఖ ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు ఆ శాఖ నియోజకవర్గ అధికారి జి.కోటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ఉద్యానశాఖ అధికారులు జిల్లాలో తొలివిడతగా 1000 ఎకరాల కొబ్బరితోటల్లో అంతర పంటగా సాగు చేసే విధంగా చర్యలు చేపడుతున్నారన్నారు. రైతుకు ఎకరాకు 200 కోకో మొక్కలు చొప్పున పూర్తి రాయితీతో అందిస్తామన్నారు. ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేసి మొక్కలు నాటుకోవడం, యాజమాన్య పద్ధతులు పాటించడం, మొక్కలు పెంచుకోవచ్చని చెప్పారు. ప్రస్తుత దశలో రైతులను గుర్తించి మొక్కలను వర్షాకాలం ప్రారంభంలో అందిస్తామన్నారు. మొక్కలు కావాల్సిన రైతులు ఆధార్, పాస్‌బుక్, బ్యాంక్‌బుక్, పాస్‌పోర్టు సైజు ఫొటోతో గ్రామ సచివాలయంలో, రైతు సేవా కేంద్రాల్లో రైతులు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

## ఎస్సీ వర్గీకరణకు కృష్ణమాదిగ కృషి


కార్యక్రమంలో మాట్లాడుతున్న నాయకులు

ఆత్రేయపురం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మాదిగ జాతి వందతరాల భవిష్యత్ రిజర్వేషన్ల వర్గీకరణ ప్రధాన లక్ష్యంగా మందా కృష్ణమాదిగ పోరాటం చేసి ఫలాలను జాతికి అందించారని పలువురు నాయకులు కొనియాడారు. శుక్రవారం మెర్లపాలెంలో మండలాధ్యక్షుడు అరుణ్ కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కొమర వీరరాఘవులు, ఎంఎస్పీ ప్రధాన కార్యదర్శి మందా యాకుబ్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. తొలుతగా బాబుజగజ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పించారు. మాదిగ జాతికి సహకరించిన ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే బండారు సత్యానందరావుల ఫ్లెక్సీల వద్ద పాలాభిషేకం నిర్వహించి స్వీట్లు పంపిణీ చేశారు.

## సీసీ రోడ్ల నిర్మాణం పరిశీలన

ఆలమూరు, మార్చి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోదుకూరులో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణాన్ని ఎంపీడీవో ఎ.రాజు పరిశీలించారు. ఎన్ఆర్‌జీఎస్ నిధులతో నిర్మించే రోడ్ల నాణ్యతలో రాజీ పడకుండా పని చేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా రోడ్డు నిర్మాణంలో నాణ్యతతోపాటు నిబంధనల మేరకు ఎత్తు తదితర అంశాలను స్థానిక ఇంజనీరింగ్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రోడ్డు నిర్మాణంపై స్థానికులతో ఎంపీడీవో చర్చించారు.